J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 45 సంచిక : 44 3.4.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# అమరావతే ఆంధ్రుల రాజధాని



- ఏపీ విభజన చట్టంలో కీలక మార్పులు
- నవ్యాంధ్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత
- పార్లమెంటు ఉభయ సభల్లో బిల్లుకు ఆమోదం

**పుష్కరకాలంగా పుట్టెడు కష్టాలు పడుతూ నిత్యం త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడుతున్న అమరావతికి ఎట్టకేలకి పునర్జీవనం లభించింది. ఆంధ్రుల ఏకైక రాజధానిగా అమరావతిని గుర్తిస్తూ పార్లమెంట్ ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లులో కీలక మార్పులు చేసింది. ఫలితంగా జగన్ సహా భవిష్యత్‌లో ఎవరు అధికారంలోకి వచ్చినా అమరావతిని రాజధానిగా మార్చలేని పరిస్థితి నెలకొంది. రాజధాని కోసం భూములిచ్చిన పాపానికి ఇన్నాళ్లూ నానా కష్టాలుపడిన రైతులు ఆనందతాడవం చేస్తున్నారు. ఇక ఉభయ సభలలో ఆమోదించి పంపిన బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం లభిస్తే అమరావతికి రాజముద్ర పడినట్లే.**

దేశంలో 28 రాష్ట్రాలుంటే అకారాది క్రమంలో ముందుండేది ఆంధ్రప్రదేశ్. అలాగే చరిత్రలో కీలక మార్పులకు నాందిపలికిన రాష్ట్రం కూడా ఆంధ్రప్రదేశ్ అంటే అతిశయోక్తి కాదు. ఎందుకంటే దేశంలో ఏర్పడిన తొలి భాషా ప్రయుక్తరాష్ట్రం ఆంధ్రప్రదేశ్. అమరజీవి పొట్టి శ్రీరాముల ప్రాణత్యాగం ఫలితంగా ఆంధ్రులకు ప్రత్యేకరాష్ట్రం ఏర్పాటైంది. దీంతో దేశ ప్రజలంతా చైతన్యవంతమై

2లో

## ఇది చారిత్రాత్మకం!



- వింజమూరు సభలో ముఖ్యమంత్రి

రాజధాని బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలపడం చరిత్రాత్మకమని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంతోషం వ్యక్తం చేశారు. ఏప్రిల్ 1న ఆ బిల్లుపై లోక్‌సభలో చర్చ జరుగుతుండగా, ముఖ్యమంత్రి నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం వింజమూరు పర్యటనలో ఉన్నారు. అక్కడ ప్రజావేదిక సభలో ఆయన ప్రసంగిస్తూ, ఆ బిల్లు ఆమోదం జరగడంపై స్పందించారు.

2లో





స్నేహాభినందనలు

స్నేహానికి నిజమైన నిర్వచనం
ఆపదలో ఆదుకునే వ్యక్తిత్వం
పిలిస్తే పలికే మనస్తత్వం
మానవీయతకు నిలువెత్తు సాక్ష్యం
ఏఎంఆర్ సంస్థల సారథి
మా డాక్టర్ మహేష్
105 సంవత్సరాల ఘనచరిత్ర కలిగిన
ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయం
"తిలక్ మహారాష్ట్ర విద్యాపీఠ్" నుండి
గౌరవ డాక్టరేట్ స్వీకరించిన సందర్భంగా
నా అభినందనలు.

ఆ సాయినాథుని ఆశీస్సులతో మహేష్ మరింత
అత్యున్నత స్థానానికి చేరుకోవాలని కోరుకుంటూ...

డాక్టర్ అనిల్ ఇస్కా
బాల్య స్నేహితుడు

# అమరావతే ఆంధ్రుల రాజధాని

(మొదటిపేజీ తరువాయి)

భాషాపరంగా ఏకమయ్యారు. తమకూ భాషా ప్రయుక్తరాష్ట్రాలు ఏర్పాటు చేయాలంటూ ఉద్యమించారు. దీంతో అప్పటికప్పుడు కేంద్రప్రభుత్వం భాషాప్రయుక్త రాష్ట్రాల కోసం ఫజల్ అలీ కమిషన్‌ను ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంతటి చరిత్ర ఉన్న రాష్ట్రానికి దశాబ్దాలుగా శాశ్వత రాజధాని లేకపోవడం పాలకుల చేతకానితనం, ఆంధ్రుల దౌర్భాగ్యమనే చెప్పాలి. తొలుత ప్రత్యేక రాష్ట్రం కోసం మద్రాసును తమిళవారికి వదులుకోవడం, తర్వాత తెలంగాణకు హైదరాబాద్ దక్కడంతో ఆంధ్రులకు రాజధాని అనేది సమాధానంలేని బ్రహ్మపదార్థంగా మారింది. ఫలితంగా ఇక్కడి యువత ఉద్యోగాలు, ఉపాధికోసం పొరుగురాష్ట్ర రాజధానులైన చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, తిరువనంతపురం వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. ఇలాంటి పరిస్థితుల్లో 2014 ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం తర్వాత 2015లో నవ్యాంధ్ర నూతన రాజధానిగా ఎంపిక చేసిన అమరావతి తెలుగు ప్రజలకి ఆశాకిరణంలా కనిపించింది. ఇకపై ఆంధ్రులను ఎవరూ వెళ్లగొట్టలేరని అంబరాన ఉన్న దేవతల రాజధాని అమరావతి తరహాలో ఆంధ్రుల రాజధాని రూపొందుతుందని నాయకులు ప్రకటించారు. ప్రధాని మోదీ చేతులమీదుగా అంగరంగ వైభవంగా శంకుస్థాపన కూడా చేశారు.

## అప్పటి నుంచి ఓ నాన్‌స్టాప్ కథాచిత్రంగా!

అయితే, ఏ లగ్నాన అమరావతికి బీజం పడిందో కానీ, దశాబ్దకాలంగా దాని చుట్టూనే ఆంధ్ర రాజకీయాలు సాగుతున్నాయి. ఎందుకంటే రాష్ట్రం మధ్యలో రాజధాని ఏర్పాటు అంటూ నవ్యాంధ్ర ముఖ్యమంత్రిగా తన తొలి అంకంలో చంద్రబాబు ఓ బృహత్తర నగర రూకల్పనకి నాంది పలికారు. అనుకున్నదే తడవుగా రైతుల నుంచి 34 వేల ఎకరాలు సేకరించారు. విజయవాడ, గుంటూరు మధ్యలోని కృష్ణానది పరీవాహక ప్రాంతాన్ని రాజధాని ఏర్పాటు కోసం ఎంపిక చేశారు. అయితే తన అనుయాయులకు, తన పార్టీ నాయకులకు ఆయాచిత లబ్ధి చేకూర్చేందుకే తిరుపతి, కర్నూలు, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, ఒంగోలు వంటి పెద్ద నగరాలని కాదని చంద్రబాబు అమరావతిని ఎంపిక చేశా రంటూ అప్పట్లో కొన్ని విమర్శలు కూడా వచ్చాయి. అసలు కృష్ణానదికి వరదలొస్తే నీటిపై తేలియాడే నగరంగా అమరావతి మారిపోతుందని ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ తీవ్రస్థాయిలో ఆరోపించింది. దీనికితోడు విభజన తర్వాత అప్పుల కుప్పగా మారిన ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి ఓ గుదిబండ అని ఆరోపించారు. విభజన కారణంగా లోటు బడ్జెట్‌తో తన ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్‌ను రుణాంధ్రప్రదేశ్‌గా మార్చడమే అని కొందరు మేధావులు, విశ్లేషకులు కూడా అభిప్రాయపడ్డారు. అయినా తన కలల ప్రాజెక్టు అమరావతిపై చంద్రబాబు వెనక్కి తగ్గలేదు. అనుకున్నదే తడవుగా 2015లో అప్పటి ప్రధాని నరేంద్ర మోడీని పిలిచి ఘనంగా శంకుస్థాపన చేయించారు. అయితే ఆ తర్వాత రాజకీయ వైరుధ్యాల వల్ల ఎన్డీయేకు చంద్రబాబు దూరం కావడం, 2019లో జగన్ నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడడంతో అమరావతి తన రూపునే కోల్పోయింది. చివరికి శ్మశానం, మురికికూపం, పాడుపడిన ప్రాంతంగా ముద్ర పడింది. అయితే, జగన్ మూడు రాజధానుల ప్రకటనకు వ్యతిరేకంగా అమరావతికి భూములిచ్చిన రైతులు దండుకట్టడం, వారికి తెలుగుదేశం, జనసేన, బీజేపీ, వామపక్ష పార్టీలు సంఘీభావం పేరుతో వెనుకుండి ఉద్యమాన్ని నడపడంతో 1,631 రోజుల పాటూ పోరాటం ఉధృతంగా సాగింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా అమరావతి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అయితే, కాల క్రమంలో మూడు రాజధానుల నినాదం, జగన్‌ను, ఆయన ప్రభుత్వాన్ని పాతాళంలో పడేయడంతో మళ్లీ చంద్రబాబు అమరావతి ఆశలు చిగురించాయి.

## కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జెట్ స్పీడ్‌తో!

మరోసారి సీఎం కావడంతో చంద్రబాబు తన జీవితకాల లక్ష్యమైన అమరావతి నిర్మాణానికి అడుగులు శరవేగంగా వేస్తున్నారు. అప్పటి వరకు భ్రమరావతి, కమ్మరావతి అంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శలు ఎదుర్కొన్న ప్రాంతం చంద్రబాబు ప్రభుత్వం రాగానే దేవతల రాజధాని, ఆంధ్రనేలిన తొలి పాలకులు శాతవాహనుల రాజధాని అంటూ తెలుగుదేశం నాయకుల నుంచి కితాబులందుకుంది. ఇదే క్రమంలో కేంద్ర బడ్జెట్‌లోనూ అమరావతికి రూ.15 వేల కోట్లు రుణసదుపాయం కల్పనకు కేంద్రం సహకరిస్తుందని ప్రకటించడంతో అమరావతి పనులు వేగం పుంజుకున్నాయి. ఇక మోడీ స్వయంగా వచ్చి రెండోసారి అమరావతి పనులను గత ఏడాది మే2న పునఃప్రారంభించారు. దీంతో దాదాపు రూ.57వేల కోట్ల విలువైన పనులు జోరందుకున్నాయి. అయితే ఈ క్రమంలో అమరావతికే అన్నీ అన్నట్లుగా పరిస్థితి మారడం, నిధులు మొత్తం అమరావతికే వెచ్చిస్తున్నరనే విమర్శలు జోరందుకున్నాయి. ఈ విషయాన్ని గుర్తించిన చంద్రబాబు తక్షణ పరిష్కారం అన్నట్లుగా మూడు ఎకనమిక్ రీజియన్ల పేరుతో రాష్ట్ర సమతౌల్య అభివృద్ధికి బాటలు వేస్తున్నామంటూ ప్రకటించారు. తిరుపతి, విశాఖపట్నం, అమరావతి రీజియన్ల కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించారు. ఇంతలో మరోసారి జగన్ వస్తే రాజధాని మారుతుందని రాజధానిపై నిర్ణయం ఎప్పుడైనా రాష్ట్ర ప్రభుత్వానిదే అని ముఖ్యమంత్రి ఎక్కడుంటే అదే రాజధాని ప్రాంతం అవుతుందనే ప్రచారం జోరందుకుంది. దీంతో, మరోసారి అమరావతి అన్యాయం కాకుండా ఉండాలంటే చట్టబద్ధ హోదా కల్పించాల్సిన అవసరం తప్పనిసరి అని చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం భావించి మార్చి 28న అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ద్వారా అమరావతే ఆంధ్రుల ఏకైక రాజధాని అని, ఈమేరకు పునర్ వ్యవస్థీకరణ చట్టంలో మార్పులు చేయాలని కేంద్రాన్ని కోరుతూ ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించింది. అయితే, ఈ తీర్మానాన్ని శాసనమండలిలో ప్రవేశపెట్టకపోవడం చర్చనీయాంశంగా మారింది.

## దేశంలోనే ప్రప్రథమంగా!

ఇక మనదేశంలో తొలుత 14 రాష్ట్రాలు ఉండగా క్రమంగా వివిధ కారణాలతో అవి 28కి చేరాయి. అయితే ఏ రాష్ట్రానికి సంబంధించిన రాజధాని విషయంలోనూ అమరావతి స్థాయిలో చర్చలు, వివాదాలు జరగలేదు. పైగా దేశంలోని ఏ రాష్ట్ర రాజధానికి సంబంధించి కూడా పార్లమెంట్ ప్రత్యేక చట్టం చేయలేదు. అయితే అమరావతి విషయంలో వైఎస్సార్‌సీపీ తీరు వల్ల తప్పనిసరిగా చట్ట సవరణ చేయాలని కూటమి ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. తద్వారా భవిష్యత్‌లో జగన్ సహా ఏ నేత వచ్చినా అమరావతిని మార్చకూడదంటే పార్లమెంట్ చట్టం ద్వారానే వీలవుతుందని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టంలో కీలక మార్పులు చేసింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలోను, అలాగే రాజ్యసభలోను బిల్లును ప్రవేశపెట్టారు. సెక్షన్ 5 సబ్‌సెక్షన్ 2లో ఆంధ్రప్రదేశ్ రాజధాని అనే ప్రస్తావన ఉన్న చోట అమరావతే ఆంధ్రప్రదేశ్ రాజధాని అని మార్చడం, రాజధాని అంటే (సీఆర్‌డీఏ) ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోకి వచ్చే ప్రాంతాలన్నీ అని అర్థం వచ్చేలా చట్ట సవరణ చేపట్టారు. తద్వారా ఆంధ్రుల ఏకైక రాజధానిగా అమరావతి ఇక అమేయం, అజేయం, అనే వాదన స్థిరపడనుంది. దీనికి రాష్ట్రపతి ఆమోదముద్ర కూడా పడితే పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లు చట్టబద్ధం అవుతుంది. అయితే, ఇంత తతంగం జరుగుతున్నా వైఎస్సార్‌సీపీ నాయకులు మాత్రం ఇదంతా చంద్రబాబు డ్రామా అంటూ మాట్లాడడం విమర్శకులను సైతం విస్తుపోయేలా చేస్తోంది. పైగా లోక్‌సభకు వెళ్లి తాము అమరావతి పునర్వ్యవస్థీకరణ బిల్లుకు వ్యతిరేకం కాదంటూనే, దాన్ని తీసు కొచ్చిన విధానానికి వ్యతిరేకం అంటూ వాకౌట్ చేయడం వారి పరువును దిగజార్చింది. దీంతో ఉమ్మడి రాష్ట్రాన్ని విడగొట్టిన కాంగ్రెస్ వంటి పార్టీలు కూడా మద్దతిచ్చినప్పుడు వైఎస్సార్‌సీపీ ఎందుకు వెనుకంజ వేసిందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సభకు వెళ్లకుండా వున్నా వైఎస్సార్‌సీపీకి కొంత మేలు జరిగేదని, సభకు వెళ్లి వెక్కిరించి రావడం మాత్రం దారుణమని తటస్థులు సైతం విమర్శిస్తున్నారు. దీనికి తోడు విజయవాడ, మచిలీపట్నం, గుంటూరు ప్రాంతాన్ని రాజధానిని చేయాలని, దానికి "మావిగన్" అని పేరు పెట్టాలంటూ తలాతోకలేని వాదనను జగన్ తాజాగా అందుకోవడం కూడా హాస్యాస్పదంగా మారింది. ఏదేమైనా దశాబ్దకాలంగా రాజధాని లేకుండా అల్లాడుతున్న ఆంధ్రులకు, అమరావతి బిల్లును పార్లమెంట్ ఉభయసభలు ఆమోదించడం మాత్రం గొప్ప ఉపశమనంగానే చెప్పుకోవాలి. దీనికి నిదర్శనం అమరావతి ఊపిరి పీల్చుకో అంటూ సోషల్ మీడియాలో పోస్టులు హోరెత్తుతుండడమే. ఇక తమకూ ఓ శాశ్వత రాజధాని ఉంటుందని అది ఉద్యోగ, ఉపాధి, అవకాశాల గనిగా మారుతుందని ఆంధ్రా యువత కంటున్న కలలకు నెట్టింట వారు పెడుతున్న పోస్టులే ప్రతిబింబమని విశ్లేషకులు సైతం వ్యాఖ్యానిస్తున్నారు. ఆల్‌దిబెస్ట్ టు అమరావతి....!

# ఇది చారిత్రాత్మకం!

(మొదటిపేజీ తరువాయి)

'ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు -2026కి బుధవారం లోక్‌సభలో అమోద ముద్ర పడిందని ఆయన తెలిపారు. అధికార పక్షంతో పాటు ప్రతిపక్ష కాంగ్రెస్‌తో సహా 11 పార్టీలు మద్దతునిచ్చాయన్నారు. వారంతా ఆ బిల్లును స్వాగతించారని, ఒక్క వైసీపీ మాత్రమే బిల్లును వ్యతిరేకించిందని అంటూ, వైసీపీ హయాంలో మూడు ముక్కలాట ద్వారా రాష్ట్రాన్ని విధ్వంసం చేసి ఆనందం పొందారని ఆయన ధ్వజమెత్తారు. అమరావతి రాజధానిగా లోక్‌సభ ఆమోదముద్ర వేయడంతో ఇక అమరావతిని ఎవరూ ఒక్క అంగుళం కూడా కదల్చలేరని ఆయన ధీమాగా చెప్పారు.

## రాజధానిపై జిల్లా నేతల హర్షం

ఇంతకాలం రాజధాని కూడా లేకపోవడంతో దిగాలుగా ఉన్న ఆంధ్రప్రజలకి అమరావతి రాజధానిగా అంగీకరిస్తూ లోక్‌సభలో ఆమోదముద్ర పడడం పట్ల సర్వత్రా సంతోషం వ్యక్తమవుతోంది. నెల్లూరుజిల్లా నేతలు ఇది రాష్ట్రాభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుందని హర్షం ప్రకటించారు.

### కల సాకారం - ఆనం రామనారాయణరెడ్డి



అమరావతికి చట్టబద్ధత రావడంతో రాజధాని అమరావతి కల సాకారమైందని, రైతుల పట్టుదల- ముఖ్యమంత్రి కృషితో అది సాధ్యమైందని రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. రాజధాని నిర్మాణానికి స్వచ్ఛందంగా భూములు ఇచ్చిన రైతుల త్యాగాలను గత ముఖ్యమంత్రి జగన్ కాలరాసేందుకు ప్రయత్నించారని, రాజధాని పేరుతో మూడు ముక్కలాట ఆడి, రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టారన్నారు. తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమరావతిని ఏకైక రాజధానిగా శాసనసభలో ఆమోదించి కేంద్రానికి పంపామన్నారు. ప్రధాని నరేంద్రమోదీ మంచి మనసుతో, ఇప్పటికి రాజధాని కల నెరవేరిందంటూ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### ధర్మం గెలిచింది - పొంగూరు నారాయణ



ఆంధ్రుల ఏకైక రాజధానిగా అమరావతి అద్భుతంగా రూపుదిద్దుకుంటోందని, లోక్‌సభలో కూడా అమరావతి రాజధానిగా ఆమోదముద్ర లభించడంతో ధర్మం గెలిచినట్లైందని.. ఇక రాష్ట్రాభివృద్ధికి ఢోకా లేదని రాష్ట్ర పురపాలక మంత్రి నారాయణ చెప్పారు. దీంతో ఇంతకాలంగా టీడీపీపై దుష్ప్రచారాలు చేస్తూ, రాజధానిపై విషం చిమ్ముతున్న వైసీపీ నేతల మూడుముక్కలాట ముగిసినట్లైందన్నారు.

### అభివృద్ధికి ఇది మంచి పునాది - వేమిరెడ్డి దంపతులు





అమరావతికి చట్టబద్ధత రావడంతో, రాష్ట్రాభివృద్ధికి దృఢమైన పునాది ఏర్పడిందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి..కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి హర్షం ప్రకటించారు. రాష్ట్రానికి ఇది మరువలేని రోజు అని, అమరావతికి చట్టబద్ధత ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు బాగా వస్తాయని, ఇది రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి వెలుగుబాట వేస్తుందని వారు చెప్పారు.

### రాష్ట్రాభ్యున్నతికి శుభ పరిణామం - సోమిరెడ్డి



రాజధాని అమరావతి కావడం రాష్ట్రాభివృద్ధికి శుభపరిణామం. దీంతో ఇన్నాళ్లుగా జగన్ ఆడుతున్న మూడు రాజధానుల నాటకం ముగిసినట్లయిందన్నారు. అమరావతికి లోక్‌సభ ఆమోదం తెలపడంతో, ఇక రాష్ట్రమంతా గర్వపడేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని మరింతగా అభివృద్ధి చేయడం ఖాయమన్నారు.

### లోక్‌సభ ఆమోదం గర్వకారణం - బీద, అజీజ్





ఆంధ్ర రాష్ట్ర రాజధానిగా అమరావతి బిల్లుకు లోక్‌సభలో ఆమోదం రావడం రాష్ట్రానికే గర్వకారణమని ఎమ్మెల్సీ, జిల్లా టీడీపీ అధ్యక్షులు బీద రవిచంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమరావతి అభివృద్ధికి కృషిచేస్తున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు చెప్తూ, అందుకు సహకరిస్తున్న ప్రధాని మోడీకి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ నాయకుడు.. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ మరో ప్రకటనలో అమరావతి రాజధాని బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలపడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ.. రాష్ట్రాభివృద్ధికి ఇదో మైలురాయిలా నిలుస్తుందన్నారు.

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు.. టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, కావలి ఎమ్మెల్యే దీవీ కృష్ణారెడ్డి, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌తో పాటు, జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, పలు పార్టీల వారు.. అందరూ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

# లివర్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- 'గ్లెనిగల్స్'ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రజనీకాంత్




లివర్ మార్పిడి విజయోత్సవ సభలో జ్ఞాపికలను అందజేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

లివర్ వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఏ సమస్య వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించాలని చెన్నైలోని గ్లెనిగల్స్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రజనీకాంత్ చెప్పారు. గ్లెనిగల్స్ హాస్పిటల్స్, చెన్నై వారి ఆధ్వర్యంలో డాక్టర్ పచ్చా రజనీకాంత్ నిర్వహించిన 'లివర్ మార్పిడీ అవగాహన మరియు విజయోత్సవ సభ' కార్యక్రమం ఈనెల 2న ఆత్మకూరులో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ అవగాహన సదస్సు ప్రజలకెంతో ఉపయోగమని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారని, వారి సూచనలతో ఆత్మకూరులో ఈ కార్యక్రమం నిర్వహించామని ఆయన తెలిపారు. ఈ సభకు మంత్రి ఆనం హాజరు కావడం ప్రజలపట్ల వారికున్న నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఆత్మకూరులో 100 పడకల హాస్పిటల్ రావడానికి ఎంతో కృషి చేసి, దాన్ని ప్రైవేట్ కార్పొరేట్ హాస్పిటల్స్‌కు దీటుగా నెలకొల్పడంలో మంత్రి ఆనం కృషి అపూర్వమని ఆయన కొనియాడారు. గతంలో ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు మురగళ్ళ గ్రామ ప్రాంతంలో ఉన్న బంజరు భూములు మాగాణిగా మారాయంటే, ఆ భూములకు సాగునీరందించిన అపర భగీరథుడు ఆనం రామనారాయణరెడ్డేనని ఆయన గుర్తుచేస్తూ, అందుకు మురగళ్ల ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

## అగ్రగామి నిర్మాణ సంస్థల సరసన

# మన ఏ.యం.ఆర్

## లక్ష కోట్ల పనులతో ఆర్డర్‌బుక్‌లో 3వ స్థానం



ఒక కంపెనీ పూర్తి చేసి అమలు చేయాల్సిన పనుల విలువతో పాటు ఆ సంస్థకి భవిష్యత్తులో వచ్చే ఆదాయాన్ని, పురోగతిని ఆర్డర్ బుక్ సూచిస్తుంది. ఇలాంటి ఆర్డర్‌బుక్ విడుదల చేసిన భారతదేశంలోని వంద అగ్రగామి (ప్రముఖ) సంస్థలలో మన నెల్లూరీయుల సంస్థ ఏ.యం.ఆర్. ఇండియా లిమిటెడ్ మూడవ స్థానంలో నిలచింది. దేశంలోని మొత్తం 100 సంస్థల వివరాలని విడుదల చేయగా వాటిలో ఎల్&టీ కన్‌స్ట్రక్షన్స్ 7లక్షల కోట్ల రూపాయల పనులతో మొదటి స్థానంలోనూ, మేఘా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ 2లక్షలా 50వేల కోట్ల రూపాయల పనులతో రెండవ స్థానంలోనిలచింది. మన నెల్లూరీయులు ఆల్తూరు మహేష్ రెడ్డికి చెందిన నిర్మాణ సంస్థ ఏ.యం.ఆర్ ఇండియా లిమిటెడ్ లక్ష కోట్ల రూపాయల పనులు చేతిలో వున్న సంస్థగా 3వ స్థానం దక్కించుకుంది.

ఈ ఆర్డర్ బుక్ ఆయా సంస్థల భవిష్యత్తు ఆదాయానికి కొలమానంగా నిలుస్తుంది. ఆర్డర్ బుక్ విలువ ఎంత ఎక్కువైతే, కంపెనీ భవిష్యత్తులో అంత ఎక్కువ ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉంటుందని అర్థం. ఆర్డర్ బుక్ ఒక కంపెనీ పనితీరును, వృద్ధి అవకాశాలను అంచనా వేయడానికి ఉపయోగపడుతుంది. పెద్ద ఆర్డర్ బుక్ ఉన్న కంపెనీలు సాధారణంగా మార్కెట్లో బలమైన స్థానాన్ని కలిగి ఉంటాయి. కాబట్టి, ఆర్డర్ బుక్ విలువ పెరగడం ఒక కంపెనీకి సానుకూల సూచనగా భావించొచ్చు. ఈ విధంగా చుస్తే మన నెల్లూరీయుల సంస్థ ఏ.యం.ఆర్ ఇండియా లిమిటెడ్ ఆ క్రమంలో లక్ష కోట్ల పనులు తమ చేతిలో ఉంచుకుని 3వ స్థానం పొందడం మన నెల్లూరీయులందరికీ గర్వకారణం. దేశంలోని వివిధ ప్రాంతాలలో 7,500 మంది సిబ్బందితో ఏ.ఎం.ఆర్ సంస్థ తమ పనులు చేస్తుండడం గమనార్హం.

అల్ ది బెస్ట్ డాక్టర్ మహేష్‌రెడ్డి!...

# అపోలోలో అరుదైన ఆపరేషన్!

- విజయవంతంగా గుండె శస్త్రచికిత్స



విలేకరులకి వివరాలను వెల్లడిస్తున్న అపోలో వైద్యబృందం

నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో అతి క్లిష్టమైన, అరుదైన గుండె శస్త్రచికిత్స విజయవంతంగా జరిగింది. నెల్లూరు బాలాజీనగర్‌కి చెందిన 74 ఏళ్ల సరోజనమ్మ అనే మహిళకు ఓపెన్ హార్ట్ పద్ధతిలో కాకుండా, లాప్రోస్కోపీ పద్ధతిలో గుండె రక్తనాళాలను విజయవంతంగా మార్పిడి చేశారు. దీనిపై గురువారం నెల్లూరు అపోలో హాస్పిటల్‌లో ప్రముఖ సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ చిర్రా భక్తవత్సలరెడ్డి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి, ఆ వివరాలు తెలిపారు. సరోజనమ్మ గుండె వాల్స్వ్ మరియు రక్తనాళాలు పూడుకుపోయాయని, సాధారణంగా అయితే ఆమెకు వాల్వ్ రీప్లేస్మెంట్, బైపాస్ సర్జరీ చేయాల్సి ఉందన్నారు. 94కేజీల బరువు కారణంగా ఆమెకు ఓపెన్‌హార్ట్ సర్జరీ చేయడం ప్రాణానికే ప్రమాదమని వెల్లడించారు. ఈ నేపథ్యంలో వారి కుటుంబసభ్యుల అంగీకారంతో టీఏవీఆర్, మరియు ఆర్‌సీఏ పద్ధతి ద్వారా లాప్రోస్కోపీ విధానంలో అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో, ఆమె గుండెకు కాలి ద్వారా అరుదైన శస్త్ర చికిత్సను నిర్వహించామన్నారు. ఈ శస్త్రచికిత్సకు ముందు పేషెంట్ యొక్క గుండె పంపింగ్ 25 నుండి 30 శాతంగా ఉండగా ఇప్పుడది 65 శాతానికి పెరిగి సాధారణంగా తయారైందన్నారు. ఈ విధానం ద్వారా ఎలాంటి కోతలు, అధిక రక్తస్రావం లేకుండా విజయవంతంగా గుండె రక్తనాళాలను మార్చామని తెలిపారు. అనంతరం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ మాట్లాడుతూ క్లిష్టమైన సర్జరీలను సైతం నెల్లూరు అపోలో హాస్పిటల్‌లో ఉన్న ఆధునిక వైద్య పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్య బృందాలతో విజయవంతంగా నిర్వహిస్తున్నామని, నెల్లూరు అపోలో హాస్పిటల్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హాస్పిటల్ యూనిట్ హెడ్ డాక్టర్ బిందు భార్గవిరెడ్డి, క్రిటికల్ కేర్ వైద్యులు డాక్టర్ ఎమ్.శ్రీనివాస్, కార్డియాలజిస్టులు డాక్టర్ షర్మిలి, డాక్టర్ నాగభూషణం కార్డియాక్ అనస్థీషియన్ డాక్టర్ మధు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రాజరాజేశ్వరమ్మవారి దేవాలయానికి...

# ధ్వజస్తంభ బంగారు తాపడం!

## వేమిరెడ్డి దంపతుల దాతృత్వం



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న వేమిరెడ్డి దంపతులు, పక్కన ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరమ్మవారి దేవాలయం ధ్వజస్తంభానికి ఈనెల 2వ తేదీ గురువారం ఉదయం బంగారు తాపడం చేయించి, సంప్రోక్షణ మహోత్సవం అత్యంత వేడుకగా నిర్వహించారు. ప్రముఖ వదాన్యులు సామాజిక–ఆధ్యాత్మిక సేవాతత్పరులు..నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి..ఆయన సతీమణి కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతుల దాతృత్వంతో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఆలయ పండితుల వేద మంత్రోచరణల మధ్య నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేమిరెడ్డి దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంప్రోక్షణ కార్యక్రమంలో పాల్గొని యజ్ఞ యాగాది క్రతువులు నిర్వహించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత ఆలయానికి చేరుకున్న వేమిరెడ్డి దంపతులకు టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్న వేమిరెడ్డి దంపతులు, ఆలయంలో పూజలు నిర్వహించి, ఆ తర్వాత బంగారు తాపడం చేయించిన ధ్వజస్తంభాన్ని ఆవిష్కరించారు. స్వర్ణకాంతులతో ధ్వజస్తంభం అద్భుతంగా ఉండడంతో భక్తులు ఆనందతన్మయులయ్యారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులు మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులతో ఆలయ ధ్వజస్తంభానికి బంగారు తాపడం చేయించడం తమ అదృష్టమన్నారు. గత ఏడాది జులైలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట చేపట్టామని, ఆ తర్వాత 8 నెలలకే ఆలయ ధ్వజస్తంభానికి బంగారు తాపడం చేయించడం సంతోషంగా ఉందని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలన్నారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, ఆలయ ధ్వజస్తంభానికి బంగారు తాపడం చేయించిన వేమిరెడ్డి దంపతులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. స్వామివారి కటాక్షం వారిపై ఎప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ సహాయ కమిషనర్ మరియు ఆలయ ఇ.ఓ కోవూరు జనార్ధన్‌రెడ్డి, ఆలయ నిర్వాహకులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి ఛారిటీస్‌కి..3 లక్షల విరాళం



నెల్లూరులోని ప్రగతి ఛారిటీస్ సంస్థకు నెల్లూరు పార్లమెంట్‌సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి.. ఆయన సతీమణి.. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గురువారం నాడు 3 లక్షల విరాళం అందించారు. ఛారిటీస్ ప్రతినిధులు పలువురు ప్రత్యేక అవసరా లున్న చిన్నారులతో కలిసి నెల్లూరులోని విపిఆర్ నివాసానికి వచ్చి ఆ చెక్కును అందుకున్నారు. అనంతరం చిన్నారులు వేమిరెడ్డి దంపతులకు గులాబీ పువ్వులు అందించి కృతజ్ఞతలు తెలియజేశారు. గత కొన్నేళ్ల నుంచి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రతిఏటా ప్రగతి ఛారిటీస్ నిర్వహణకు రూ.3 లక్షలు విరాళం అందిస్తున్నారంటూ ఛారిటీస్ ప్రతినిధులు వారి సేవాభావాన్ని కొనియాడారు.

# కార్మిక వ్యతిరేక చట్టాలు..వద్దనే వద్దు!

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని, 29 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా మార్చడం దారుణమని, అది కార్మికులకు అన్యాయం చేయడమేనని నెల్లూరులోని అఖిలపక్ష సంఘాల నాయకులు నిరసన గళమెత్తారు. ఈనెల 1న ఆ 4 లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నిరసనలు వ్యక్తం చేశారు. కార్మిక వ్యతిరేక చట్టాలు వద్దనే వద్దంటూ నినాదాలు చేశారు. సీఐటియు, ఏఐటీయుసి, ఐఎన్‌టీయుసి, హెచ్ఎంఎస్, వైఎస్సార్‌టీయు, ఐఎఫ్‌టీయు తదితర సంఘాల నాయకుల ఆధ్వర్యంలో స్థానిక గాంధీబొమ్మ కూడలి వద్ద నుంచి విఆర్‌సి సెంటర్ వరకు ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కొత్త లేబర్‌కోడ్‌లు వద్దంటూ దేశవ్యాప్తంగా కార్మికవర్గం ఆందోళన చేస్తున్నా కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. కేంద్రప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా, కార్మికులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ఇకనైనా కార్మిక చట్టాలను అమలుచేయాలన్నారు. సీఐటీయు జిల్లా అధ్యక్షుడు టీవీవీ ప్రసాద్, నగర కార్యదర్శి నాగేశ్వరరావు, ఏఐటీయుసి నాయకులు బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

లాయర్
ఏప్రిల్ 03, 2026

# ఆరోగ్యం బాగుంటే.. అన్నీ బాగున్నట్లే!

'ఆరోగ్యమే మహాభాగ్యమని', ఎవరికైనా సరే..ఆరోగ్యం బాగుంటేనే అన్నీ బాగున్నట్లు. లేకుంటే..ఎన్నున్నా..ఏమీ లేనట్లే అనీ'..మన పెద్దలు అంటుంటారు. నిజమే, ఆరోగ్యమే బాగ లేకపోతే ఎన్నో బాధలు పడాలి. అనారోగ్యం మనిషిని కుంగ దీస్తుంది. బతుకే నరకయాతనగా మారుతుంది..అందుకే, జీవితంలో ఎన్ని కష్టనష్టాలున్నా ముందుగా ఆరోగ్యాన్ని మాత్రం జాగ్రత్తగా చూసుకోవాలి. అయితే, వాస్తవానికి ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు మంచి ఆరోగ్యకరమైన వాతా వరణమే లేదు. ఎక్కడ చూసినా కాలుష్యం, కల్తీలు. అనారోగ్య భూతం వీరంగం చేస్తున్న రోజులివి. కరోనా కాలం పోయినా, ఇంకా వాతావరణ మార్పులు, మరోవైపు ప్రపంచీకరణ వంటివాటితో ఎక్కడ చూసినా ప్రాణాంతక వ్యాధులు వీరంగం చేస్తూనే ఉన్నాయి. మనదేశంలో కూడా ఎక్కడ చూసినా కాలు ష్యమే జనాన్ని కాల్చుకుతింటోంది. మరోవైపు తినే తిండిలో, తాగే నీళ్లల్లో, పీల్చే గాలిలో కూడా కల్తీలు, కాలుష్యాలే. ధనా శతో కల్తీ వ్యాపారాలు జోరుగా సాగుతున్నా, ప్రజల ఆరో గ్యాన్ని నాశనం చేస్తున్న కల్తీలను అరికట్టేందుకు ప్రభుత్వాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోలేకపోతున్నాయి. కారణమేదై తేనేం.. ఎంతోకాలంగా క్యాన్సర్, గుండెజబ్బులు, మధుమేహం వంటి ప్రాణాంతక వ్యాధులతో దేశంలో కోట్లాది మంది జనం అల్లాడిపోతున్నారు. ఒక్క మధుమేహం వ్యాధితోనే ఏటా సుమారు 10 కోట్ల మందికి పైగానే బాధితులు ఆసుపత్రుల పాలవుతున్నారని ఆరోగ్యసంస్థల అధ్యయనాలు వెల్ల డిస్తున్నాయి. అదేవిధంగా, గుండెజబ్బులు-అధిక రక్తపోటు కారణంగా ఏటా 28.6 లక్షల మంది ప్రాణాలు పోగొట్టు కుంటున్నారని, ఇంకా శ్వాసకోశ వ్యాధులు, క్షయ, కిడ్నీ జబ్బుల వంటి ప్రాణాంతక వ్యాధులు మనదేశంలో బాగా విజృంభిస్తు న్నాయని నిపుణులు చెప్తున్నారు. మహిళలకు గర్భాశయ, ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధులు విపరీతమవుతున్నాయం టున్నారు. ఒక్క గర్భాశయ క్యాన్సర్ వ్యాధితో భారత్‌లో ఏటా 77వేల మందికి పైగానే మహిళలు మరణిస్తూనే ఉన్నారని తాజా అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ఇంకా లక్షలాది మంది అనేకరకాల వ్యాధులతో మరణిస్తూనే ఉన్నారు. పరిస్థితులు ఇంత విషమంగా ఉన్నా, ఆరోగ్య పరిరక్షణలో మనం ఇంకా అలక్ష్యంగానే ఉంటున్నాం. దీంతో క్రమేణా మానసిక వత్తిడిలు పెరగడం, వయసుతో పాటు మతిమరుపు పెరగడం, అల్జీమర్స్ వంటి భయంకర వ్యాధులకు కారణ మవుతోంది. ధూమపానం, మద్యపానం, పొగాకు ఉత్పత్తులను వాడడం వంటి ద్వారా ఆరోగ్యం గాలిలో కలిసిపోతున్నా, వాటిని మానలేకపోతున్నారు. మరోవైపు గంజాయి వంటి మాదకద్రవ్యాలు సమాజాన్ని విషపూరితం చేస్తూనే ఉన్నాయి. ప్రధానంగా జీవనశైలిలో వస్తున్న మార్పులే ఈ వ్యాధులకు, వాటి తీవ్రతకు ప్రధాన కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇంకోవైపు, పోషకాహార లోపం కోట్లాది కుటుంబాలకు శాపంగా పరిణమిస్తూనే ఉంది. రానురాను మనుషుల్లో శారీరక శ్రమ లోపించడం, మానసిక వత్తిడులు అధికం కావడం, ఆరోగ్య కరమైన జీవనశైలి పోయి, దుర్భరమైన వ్యాధులను తెచ్చే ఆహారపుటలవాట్లకు లోబడిపోతుండడం ఈ కాలంలో సర్వసాధారణంగా మారింది. యోగ, ధ్యానం వంటివాటిని వదిలేసి, ఆధునిక అలవాట్లతో లేనిపోని రోగాలు తెచ్చు కుంటున్నారు. చిన్నతనం నుంచే అధిక బరువు, కదలలేక ఆయాసం వంటి రోగాలతో అవస్తలు పడుతూనే ఉన్నారు. జంక్ ఫుడ్‌లు, పిజ్జాలు, బర్గర్లు వంటివి, రసాయనాలతో తయారయ్యే కూల్‌డ్రింక్‌లు వగైరాలు అనారోగ్యకరమని వైద్యనిపుణులు నెత్తినోరూ మొత్తుకుంటున్నా వినేవాళ్ళు లేరు. నిత్యం వ్యాయామం, నడక, తగినంత నీరు తాగుతుండడం, ఉప్పును వీలైనంత తగ్గించుకోవడం, వేళకు నిద్రపోవడం వంటి మంచి అలవాట్లను పాటించడం లేదు. దీంతో జబ్బులు పెరిగిపోతున్నాయి. ఇకనైనా అందరం కలిసికట్టుగా ఉంటూ ఈ వ్యాధుల బారినుంచి మనల్ని మనమే కాపాడుకోవాలి. కల్తీలను నియంత్రించుకొని మంచి ఆహారాన్ని స్వీకరించాలి. అనారోగ్యాన్ని దూరం చేసుకోవాలి. విజ్ఞానశాస్త్రానికి అండగా ఉంటూ, అందరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటూ ఈ ఏడాది 'ప్రపంచ ఆరోగ్య దినోత్సవం-2026' కూడా పిలుపు నిచ్చింది. ఆ దిశలో అందరూ పయనిస్తే, కొంతలో కొంత ఆరోగ్యంతో జీవించవచ్చు. ఏదేమైనా, వ్యాధుల పట్ల అవ గాహనతో ఉండడమే ముఖ్యం. జబ్బులొచ్చాక బాధపడేకంటే, ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు చేయించుకుంటూ, ముందు జాగ్రత్తలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే శ్రేయస్కరం. మంచి ఆరోగ్యమే మనకు రక్ష!.. అప్రమత్తతే మన జీవితా లకు శ్రీరామరక్ష!..

**ఏప్రిల్ 7.. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం**

# ప్రభుత్వం కమ్యూనిటీహాళ్ళని అందుబాటులోకి తేవాలి!

నెల్లూరు నగరంలో ప్రభుత్వ స్థలములలో చక్కటి పార్కులని అభివృద్ధి చేస్తూ వాటిలో జిమ్‌తో పాటుగా, చిన్నపిల్లలకి అవసరమైన క్రీడా పరికరాలు మొదలగు వాటిని ఏర్పాటు చేయడం ప్రజలకు ఎంతో ఉపయోగకరం అవుతున్నది. నగరవాసులకు చాలా ఆహ్లాదకరముగా ఉంటున్నది. ప్రభుత్వము పార్కుల ఏర్పాటుతో పాటు కొన్ని స్థలములలో కనీసం రెండు డివిజన్లని కలిపి ఒక కమ్యూనిటీ హాల్ కూడా నిర్మించినచో దిగువతరగతి మరియు మధ్యతరగతి ప్రజలకు చాలా సౌకర్యంగా ఉంటుంది. సామాన్యులు జరుపుకునే శుభకార్యాలకు, చిన్న చిన్న వేడుకలకు ఈ కమ్యూనిటీ హాళ్లు ఉపకరిస్తాయి. లక్షల రూపాయలు వెచ్చించి ప్రైవేట్ కళ్యాణ మండపాలలో వేడుకలు చేసుకోవాలంటే మధ్యతరగతి ప్రజలకు చాలా ఆర్థికభారం. ప్రభుత్వ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు ఆలోచించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుకొంటున్నాను.

*కాళహస్తి సుబ్రహ్మణ్యం* - బాలాజీనగర్, నెల్లూరు.

# బిట్రగుంటని బ్రతికించండి!

'రైల్వే బిట్రగుంట'గా ప్రసిద్ధి చెందిన బిట్రగుంట గురించి గత వారం మన 'లాయర్'లో ఫయాజ్ గారు రాసిన వ్యాసం చాలా అర్థవంతంగా వుంది. "అంగట్లో అన్నీ వున్నా అల్లుడి నోట్లో శని" అన్న సామెత గుర్తుకి వచ్చేలా, రైల్వే బిట్రగుంటని అభివృద్ధి చేయడానికి అవసరమైన అన్ని వనరులు అక్కడ వున్నా ఆ ప్రాంతాన్ని పట్టించుకునే నాథులే కరువయ్యారు. ప్రస్తుతం రాష్ట్రాన్ని పాలిస్తున్న కూటమి ప్రభుత్వానికి అన్ని అనుకూల పవనాలే వీస్తున్నాయి. దశాబ్దాల కలగానే మిగిలిపోయిన రైల్వే జోన్ కల సాకారం కాబోతోంది. ఇదే తరుణంలో కోమాలో కొట్టుమిట్టాడుతున్న రైల్వే బిట్రగుంటకి కూడా ఊపిరిపోయాలని మన జిల్లా ఎంపీలకు, రాజ్యసభ సభ్యులకు విన్నవించుకుంటు న్నాను. బిట్రగుంట దీన స్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అభివృద్ధికి అన్ని విధాలా అనుకూలంగా వున్న ఆ ప్రాంతానికి పూర్వ వైభవం తీసుకురావాలని స్థానిక శాసనసభ్యులు కృష్ణారెడ్డి గారికి విజ్ఞప్తి చేస్తున్నాను.

*- నలుబోలు పద్మజ*, హైదరాబాదు.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

## ఉగాది పురస్కారాలు

# జిల్లాకి గర్వకారణం!

రేవూరి అనంత పద్మనాభరావు గారికి కళారత్న పురస్కారం రావడం జిల్లాకి గర్వకారణం. ఆయన నిరంతరం రచనా వ్యాసంగంలో నిమగ్నులై ఉంటారు. రచన వారి శ్వాస. వారి కావ్యదృష్టి, నిబద్ధత, శైలీ విశేషాలకు, వ్యక్తిత్వానికి ఈ పుర స్కారం చిరుగుర్తింపు. వారితో పాటు చిన్ని నారాయణరావు తదితరులు కూడా 'కళా రత్న'తో పాటు ఇతర ఉగాది పురస్కారాలు అందుకోవడం సంతోషదాయకం. వివిధ రంగాలలో సేవలందిస్తున్న నిష్ణాతులను ఎంపికచేసి వారిని ఇలాంటి పురస్కారా లతో సత్కరించడం మంచి సంప్రదాయం. వారిలోని ప్రతిభను గుర్తించి సమాజానికి తెలియపరచడమే కాకుండా, ఇతరులకు స్ఫూర్తి కలిగించడానికి ఈ సత్కారాలు ఉప కరిస్తాయి. అందరికీ నా అభినందనలు.

*సి.ఆర్. విశ్వేశ్వరరావు*
మాజీ ఉపకులపతి, హైదరాబాదు.

# యుద్ధం వెనక వ్యాపారం

మనసులో మాట 91

నేటి ప్రపంచ పరిణామాలను గమనిస్తే, సామాన్యుడికి కలిగే అతిపెద్ద సందేహం - యుద్ధాలు శాంతి కోసం జరుగుతున్నాయా లేక కొన్ని శక్తులు సంపద పెంచుకోవడం కోసం సృష్టి స్తున్నాయా అని. ఇటీవలి కాలంలో అమెరికా రక్షణ మంత్రి పీటర్ హెగ్సెత్ చుట్టూ ముసురుకున్న వివాదాలు గాజా యుద్ధం సమయంలో ట్రంప్, అంతకు ముందు ఆయన అల్లుడు చేసిన ప్రకటనలు ఈ అనుమానాలకు కారణం.

2026 మార్చి చివరి వారంలో కొన్ని పత్రికలు ప్రచురించిన సంచలనాత్మక కథనం ప్రకారం, అమెరికా రక్షణ మంత్రి పీటర్ హెగ్సెత్ వ్యక్తిగత బ్రోకర్, ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు యుద్ధంగా మారడానికి కొన్ని వారాల ముందే భారీగా రక్షణరంగ షేర్లలో పెట్టుబడి పెట్టడానికి ప్రయత్నించారు. మార్గాన్ స్టాన్లీకి చెందిన సదరు బ్రోకర్, 'బ్లాక్‌రాక్' సంస్థకు చెందిన 'డిఫెన్స్ ఇండస్ట్రియల్స్ యాక్టివ్ ETF'లో మిలియన్ల కొద్దీ డాలర్లు పెట్టుబడి పెట్టాలని సంప్రదించినట్లు వార్తలు వచ్చాయి.

ఈ ఈటీఎఫ్‌లో లాక్హీడ్ మార్టిన్, రేథియాన్, బోయింగ్, నార్త్రోప్ గ్రుమ్మన్ వంటి పెద్ద రక్షణ రంగ కంపెనీల షేర్లు ఉన్నాయి. ఒకవేళ యుద్ధం జరిగితే ఈ కంపెనీల షేర్లు అమాంతం పెరుగుతాయని ఊహించి ఈ ప్రయత్నం జరిగినట్లు విమర్శలు వచ్చాయి. పెంటగాన్ ఈ వార్తలను "అబద్ధం, కల్పితం" అని కొట్టివేసి నప్పటికీ, కీలక నిర్ణయాలు తీసుకునే స్థాయిలో ఉన్నవారు తమకు తెలిసిన సమా చారాన్ని ఉపయోగించుకుని సంపద పెంచుకోవాలని చూస్తున్నారా అన్న చర్చ అంతర్జాతీయ స్థాయిలో మొదలైంది. ఇరాన్‌పై యుద్ధం చేయాలని తనకు సూచించిన మొదటి వ్యక్తి హెగ్సెత్ అని స్వయంగా ట్రంప్ పేర్కోవడం గమనార్హం.

## గాజా పునర్నిర్మాణం: 'రియల్ ఎస్టేట్' కోణం

మరోవైపు, యుద్ధం వల్ల సర్వనాశనమైన గాజా స్ట్రిప్‌ను ఎలా చూడాలి అనే విషయంలో డొనాల్డ్ ట్రంప్ గత ఏడాది చేసిన వ్యాఖ్యలు విస్తుగొలిపేలా ఉన్నాయి. గాజాను ప్రపంచంలోనే ఒక అద్భుతమైన "రియల్ ఎస్టేట్ సైట్"గా మార్చవచ్చని, దానిని "మిడిల్ ఈస్ట్ రివేరా"లాగా అభివృద్ధి చేయవచ్చని ఆయన యుద్ధం జరుగుతున్న సమయంలోనే పేర్కొన్నారు. ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్ అంతకుముందు ఏడాది మాట్లాడుతూ గాజా తీర ప్రాంతం అత్యంత విలువైనదని, అక్కడ విలాసవంతమైన భవనాలు, మెరైన్ రిసార్టులు నిర్మించడానికి అవకాశం ఉందని అన్నారు. ఇది కేవలం మానవతా దృక్పథంతో చేసే పునర్నిర్మాణంలా కాకుండా, యుద్ధం వల్ల ఒక ప్రాంతాన్ని తుడిచిపెట్టి, ఆ ఖాళీ ప్రదేశంలో కార్పొరేట్ కంపెనీలు లాభాలు గడించడానికి చేస్తున్న ప్రణాళికలా కనిపిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ధోరణిని "డిజాస్టర్ కాపిటలిజం" అని పిలుస్తారు. అంటే ఒకరి వినాశనం మరొకరికి పెట్టుబడిగా మారుతుంది.

## ప్రపంచ రక్షణ బడ్జెట్ల పెరుగుదల

ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులు రక్షణ రంగ కంపెనీలకు "బంగారు బాతు"లా మారాయి. ప్రపంచవ్యాప్త రక్షణ ఖర్చు 2026 నాటికి 2.6 ట్రిలియన్ డాలర్ల మార్కును దాటనుంది. ఇది 2025 కంటే 8.1% ఎక్కువ. గతంలో నాటో దేశాలు తమ జీడీపీలో 2% రక్షణ కోసం కేటాయించాలనే నిబంధన ఉండేది. కానీ ఇప్పుడు అది 5% లక్ష్యం వైపు మళ్లుతోంది. ముఖ్యంగా పోలాండ్ వంటి దేశాలు ఇప్పటికే 4.7% బడ్జెట్‌ను ప్రకటించి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అటానమస్ డ్రోన్లు, అంతరిక్ష యుద్ధ తంత్రాల కోసం కేటాయింపులు 2026లో ఏకంగా 12% వృద్ధిని నమోదు చేశాయి. ఉక్రెయిన్ - రష్యా, అమెరికా-ఇరాన్ యుద్ధాల కారణంగా క్షిపణులు, రాకెట్లు, బాంబుల తయారీ కంపెనీలైన లాక్హీడ్ మార్టిన్, రేథియాన్ వంటి సంస్థల షేర్లు చారిత్రాత్మక గరిష్టాలను తాకాయి. ఈ సంస్థలు రాబోయే ఐదేళ్లలో మరో 1.8 ట్రిలియన్ డాలర్ల విలువైన ఆర్డర్లను ఆశిస్తున్నాయి. 2021-2025 మధ్య కాలంలో ప్రపంచ ఆయుధ ఎగుమతుల్లో 42%వాటాతో అమెరికా అగ్రస్థానంలో ఉంది. పాశ్చాత్య దేశాల ఆంక్షలను తప్పించు కోవడానికి ఇరాన్, ఉత్తర కొరియా, రష్యాలు ఒకదానికొకటి సాంకేతికత విడిభాగాలను మార్చుకుంటూ ఒక 'సెకండరీ మార్కెట్'ను సృష్టించాయి. చైనా కూడా ఈ సెకండరీ మార్కెట్‌కు పరోక్షంగా సహకరిస్తోందన్న అనుమానాలున్నాయి. ఇజ్రాయెల్-హమాస్ మరియు ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో, 2024లో ఇజ్రాయెల్ సైనిక వ్యయం 65% పెరిగింది. ఇది 1967 తర్వాత నమోదైన అతిపెద్ద పెరుగుదల. సంప్రదాయ ఆయుధాల వ్యాపారంలో ముందున్న పాశ్చాత్య దేశాల కంటే వేగంగా హై-టెక్ పరికరాలను సరఫరా చేయగల సామర్థ్యం ఉండటంతో దక్షిణ కొరియా, టర్కీ (ముఖ్యంగా డ్రోన్‌ల విషయంలో) దేశాల అమ్మకాలు విపరీతంగా పెరిగాయి.

## ఆధునిక 'నీరో'లు.. నయా ఫిడేళ్లు!

రోమ్ నగరం మంటల్లో చిక్కుకున్నప్పుడు, ప్రజల ఆర్తనాదాలను పట్టించుకోకుండా తన భవనంపై కూర్చుని నీరో చక్రవర్తి ఫిడేల్ వాయిస్తూ సంగీతాన్ని ఆస్వాదించాడని చెబుతుంటారు. నేడు కొంతమంది వైఖరి అలాగే ఉంది. గాజాపై ట్రంప్, ఆయన అల్లుడి ప్రకటనలే ఇందుకు తార్కాణం. అభిప్రాయ భేదాలకు, వైరుధ్యాల ఘర్షణ లకు యుద్ధమే తొలి పరిష్కారం అన్నధోరణి మారనంత వరకు ఈ వ్యాపారం కొనసాగుతూనే ఉంటుంది. యుద్ధాలు వస్తూనే ఉంటాయి. దీనికి పరిష్కారం భారత్ తాత్వికతలో ఉంది. వసుధైక కుటుంబం అన్న భావన ప్రపంచమంతా వ్యాపించాలి. శాంతి మంత్రం ప్రతిధ్వనించాలి. భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ చొరవ తీసుకోవడం అభినందనీయం.



**- తుమ్మల బాల గంగాధర్ తిలక్**

## రైతుల్ని దోచుకుంటున్నవారిపై..

# క్రిమినల్ చర్యలు తీసుకోవాలి!

**• సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి**



ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల, సోమిరెడ్డి

జిల్లాలో వరి రైతుల వద్ద అక్రమంగా, అదనంగా ధాన్యం దోచుకుంటున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోరారు. ధాన్యం కొనుగోళ్ళ సందర్భంగా పుట్టికి 950 కిలోల వరకు తీసుకోవడం దుర్మార్గమన్నారు. మిల్లర్లు, దళారుల ఆగడాలకు అడ్డుకట్ట వేయకపోతే రైతు మరింత నష్టపోతారన్నారు. సర్వేపల్లి నియోజకవర్గం తోటపల్లిగూడూరు మండలం పేదూరులో ఇటీవల పర్యటించిన రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్‌తో సోమిరెడ్డి మాట్లాడుతూ, ధాన్యం పుట్టి అంటే 860 కిలోలని, ఒకవేళ ధాన్యంలో తేమ (నెమ్ము) ఉంటే ఓ 20, 30 కిలోలు అదనంగా తీసుకుంటే సరే.. కానీ 100 కిలోలు ఎందుకివ్వాలని ఆయన ప్రశ్నించారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని వ్యాపారులు, దళారులు దోచుకోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ పరిస్థితులను పరిశీలించి ప్రతి రైతుకు కనీస మద్దతు ధర లభించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. ధాన్యం తరలించేందుకు గోతాలను ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంచడంతో పాటు ట్రాక్టర్లకు జీపీఎస్ నిబంధన తొలగించాలని ఆయన మంత్రిని కోరారు. మంత్రి, ఎమ్మెల్యేతో పాటు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, జేసీ వెంకటేశ్వర్లు, టీడీపీ–జనసేన నాయకులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల అభ్యున్నతే..

# టీడీపీకి ముఖ్యం


ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

మత్స్యకారుల అభ్యున్నతే తమ తెలుగుదేశం పార్టీకి ముఖ్యమని, వారికి ఎల్లవేళలా తాము అండగా ఉంటామని టీడీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు.. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరులోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, వైకాపా హయంలో మత్స్యకారులకు వారు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. గతంలో వైయస్ రాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన అడ్డగోలు జీవోలను తొలగించి. రెండుజిల్లాలకు ఫిషింగ్ హార్బర్‌ను, రామాయపట్నం పోర్టుని అందించిన ఘనత చంద్రబాబుదన్నారు. నెల్లూరుజిల్లాలో ఫిషింగ్ హార్బర్ ఏర్పడడానికి అప్పటి ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుల కృషే ప్రధాన కారణమన్నారు. జగన్ తన సొంత ప్రయోజనాల కోసం ముత్తుకూరు–కృష్ణపట్నం నుండి ఓడరేవు(వాన్ పిక్) వరకు ఏ నిర్మాణం రాకుండా దుర్మార్గమైన జీవో ఇచ్చారని దుయ్యబట్టారు. జగన్మోహన్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డిలకు ఛాలెంజ్ విసురుతున్నా..‘మీ ప్రభుత్వంలో మత్స్యకారులకు ఒక్క వల కానీ, ఒక్క తెప్ప కానీ.. కనీసం లక్ష రూపాయల స్కీమ్ కానీ ఇచ్చారా.. అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించేందుకు కృషిచేస్తున్న ముఖ్యమంత్రిని, యువనేత లోకేష్‌లను విమర్శించడంలో అర్థం లేదన్నారు.

**ఆ బోట్లు తమిళనాడువి కాదు :**

జువ్వలదిన్నెలో దొంగిలించబడిన బోట్లు తమిళనాడుకు చెందినవి కాదని, అవి పాండిచ్చేరికి చెందిన కారైకల్ వారివని రవిచంద్ర తెలిపారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కోసం, డీఎంకే ఎన్నికల ప్రయోజనం కోసం బీద మస్తాన్‌రావు చొరవ తీసుకొని బోట్లు విడిపించారన్నది అసత్యం, అర్థరహితం, అది కేవలం ప్రతిపక్షాల దుష్ప్రచారమని ఆయన ఖండించారు. జువ్వలదిన్నె నుండి తీసుకువెళ్లిన బోట్లకు రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావుకి ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు.

# పార్లపల్లిలో విపిఆర్ ‘అమృత ధార’

**• వాటర్ ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి**


‘అమృత ధార’ వాటర్‌ప్లాంట్‌ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

విడవలూరు మండలం పార్లపల్లి గ్రామంలో ఇటీవల విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ‘అమృత ధార’ ఆర్వో వాటర్ ప్లాంట్‌ను కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజల దాహార్తిని తీర్చాలనే మహదాశయంతో, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సంకల్పంతో 2016లో ఉదయగిరిలో ప్రారంభమైన అమృతధార ప్రస్థానం నేడు జిల్లా అంతటా విస్తరించిందన్నారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా సుమారు 200 వాటర్ ప్లాంట్ల ద్వారా ప్రజల దాహార్తిని తీరుస్తున్నామన్నారు. కోవూరు నియోజకవర్గంలో ఇది 26వ ప్లాంట్ అని, దీని నిర్వహణ బాధ్యతను కూడా విపిఆర్ ఫౌండేషనే చూసుకుంటుందని ఆమె చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక పార్లపల్లి గ్రామంలో చేసిన అభివృద్ధి పనులను ఆమె ఈ సందర్భంగా వివరించారు.

# ఖండన ప్రకటన

నా కక్షిదారులైన **మెస్సర్స్ అనిల్‌కుమార్‌రెడ్డి & అసోసియేట్స్** పార్టనర్‌షిప్ ఫరం నందు వున్న భాగస్తులు **ఇస్కా అనిల్‌కుమార్‌రెడ్డి** మరియు అతని భార్య అయిన **శ్రీమతి చిచ్చిలి రజిత** గార్ల సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయడమైనది ఏమనగా, సదరు సంస్థ యొక్క ఇతర భాగస్తులు (స్వల్ప వాటా కలిగి) అయిన **1) ధాకా లక్ష్మిరెడ్డి** (లేట్) కుమారుడు **ధాకా కోటిరెడ్డి** మరియు అతని భార్య అయిన **శ్రీమతి ధాకా అనురాధ** గార్లు లోగా **20.03.2026**వ తేదీన లాయర్ వార్తాపత్రిక నందు ఒక హెచ్చరిక నోటీసు ఇవ్వడం జరిగినది. సదరు హెచ్చరిక నోటీసు ద్వారా పైన తెలిపిన ఇరువురు స్వల్ప భాగస్తులైన **శ్రీ ధాకా కోటిరెడ్డి** గారు మరియు **శ్రీమతి ధాకా అనురాధ** గార్లు మరియు ఇస్కా అనిల్‌కుమార్‌రెడ్డి గారు మరియు అతని భార్య శ్రీమతి **చిచ్చిలి రజిత** గార్లు కలిపి **మెస్సర్స్ అనిల్‌కుమార్‌రెడ్డి & అసోసియేట్స్** అను భాగస్వామ్య సంస్థ స్థాపించబడినట్లు మరియు సమ నిష్పత్తిలో మరియు నిర్దిష్ట కాల పరిమితితో ఏర్పరచుకొని మరియు స్థిరాస్తి లావాదేవీలు నిర్వహించుచున్నట్లుగాను, వ్యాపార సంబంధముగా **25.07.2007 డాక్యుమెంట్ నెం. 13716/2007** విక్రయ పత్రం ద్వారాన్నూ మరియు **26.07.2007** డో.నెం. 13764/2007 విక్రయపత్రం ద్వారాన్నూ భూమిని కొనుగోలు చేసి అనిల్ గార్డెన్స్ పేరుతో ఫంక్షన్ హాలు ఏర్పాటు చేసి నిర్వహించుచున్నట్లుగా దాని నిర్దిష్ట కాలపరిమితి **16.01.2027** తరువాత సదరు భాగస్వామ్య సంస్థ రద్దు అగుబడును అని తెలియచేసియున్నారు.

ఈ విషయం వాస్తవ దూరం అయివున్నది సంస్థ యొక్క రిజిష్టర్ భాగస్వామ్య పత్రం ప్రకారం సంస్థలో ఉన్నటువంటి నలుగురు భాగస్వామ్య పక్షాల లాభ, నష్టాల నిష్పత్తి

**1) ఇస్కా అనిల్‌కుమార్‌రెడ్డి గారు 47.5% (నలభై ఏడున్నర శాతం)**
**2) చిచ్చిలి రజిత గారు 47.5% (నలభై ఏడున్నర శాతం)**
**3) ధాకా కోటిరెడ్డి 2.5% (రెండున్నర శాతం)**
**4) ధాకా అనురాధా 2.5% (రెండున్నర శాతం)గా కలిగియున్నారు.**

ఈ విషయం ఎవరు అయినను మీసేవ ద్వారా లేదా డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ ఆఫ్ ఫర్మ్స్, నెల్లూరు నుండి (ఫర్మ్ రిజిస్ట్రేషన్ నెం. 250/2007) అయిన తెప్పించుకొని చూసుకొని సందేహ నివృత్తి చేసుకోగలరు. కాని, సదరు భాగస్వామ్య పత్రం (పార్టనర్‌షిప్ డీడ్ 17.01.2007)కి విరుద్ధంగా సదరు భాగస్వామ్యం యొక్క కాలపరిమితి 16.01.2027 వరకు మాత్రమే ఉందని చెప్పడం అబద్ధం. ఆ విధంగా సదరు భాగస్వామ్య పత్రంలో ఎక్కడా లేదు. కావున హెచ్చరిక నోటీసు జారీ చేసిన సదరు ధాకా కోటిరెడ్డి గారికి శ్రీమతి ధాకా అనురాధ గారికి సమ నిష్పత్తిలో భాగస్వామ్యం లేదు. కావున పై గడవు కాలం తీరిన తరువాత పైన తెలిపిన అనిల్ గార్డెన్స్ ఫంక్షన్ హాలులో నలుగురు భాగస్తుల సమ నిష్పత్తిలో పంపిణీ చేసుకోవలసిన అని తెలియజేయుట అవాస్తవం మరియు సదరు ఇస్కా అనిల్‌కుమార్‌రెడ్డి గారు మరియు శ్రీమతి చిచ్చిలి రజిత గార్లు అనిల్ గార్డెన్ భూమి యందు ఎక్కువ వాటా గలవారని నెల్లూరు అదనపు జిల్లా కోర్టు యందు సివిల్ దావా ఓ.ఎస్.నెం.87/2018 చేసియున్నారు అని వక్రీకరించి చెప్పడం కూడా తప్పు, సదరు దావా వేసియున్నది. పైన తెలిపిన నిష్పత్తి ప్రకారం నలుగురు భాగస్వామ్యాలు నిష్పత్తి రద్దుపరిచి ఇస్కా అనిల్‌కుమార్‌రెడ్డి మరియు చిచ్చిలి రజిత గార్లు (95% భాగస్వామ్యం కలిగిన భాగస్తులు) కలిగి వ్యాపారం కొనసాగించుకుంటున్న గతంలో 17.01.2007 ద్వారా ఏర్పడిన భాగస్వామ్య పత్రం రద్దుపరచి ఫర్మ్ తాలూకా లెక్కలు అన్ని సరిచూసుకొనుటకు వ్యాజ్యం దాఖలు చేసియున్నారు. సదరు వ్యాజ్యం విచారణకు వచ్చియున్నది. సదరు వ్యాజ్యం నందు నా కక్షిదారులైన ఇరువురి సాక్ష్యం పూర్తి అయినది. నా కక్షిదారుల సాక్ష్యాల సదరు భాగస్వామ్య నిష్పత్తిలు నిజం అని చెప్పుటకు జిల్లా రిజిస్ట్రార్ ఆఫ్ ఫర్మ్‌ను కూడా విచారించి పైన తెలిపిన భాగస్వామ్య నిష్పత్తి నిజం అని నిరూపించడం కూడా జరిగింది. తదుపరి హెచ్చరిక నోటీస్ ఇచ్చినటువంటి పై ఇరువురు అయిన ధాకా కోటిరెడ్డి మరియు వారి శ్రీమతి ధాకా అనురాధ గార్ల సాక్ష్యం కొరకు వ్యాజ్యం పెండింగ్‌లో వున్నది. కావున కోర్టులో తీర్మానం అగునంతవరకు సదరు **మెస్సర్స్ అనిల్‌కుమార్‌రెడ్డి & అసోసియేట్స్** ఆస్తులపై అజమాయిషీ మేనేజింగ్ పార్టనర్ అయిన ఇస్కా అనిల్‌కుమార్‌రెడ్డి గారికి తప్ప ఇతర భాగస్తులకి లేదు. ఈ విషయం సంపూర్ణంగా తెలిసి కూడా దురుద్దేశ్యంతో, అక్రమంగా లబ్దిపొందాలని నిజాలను వక్రీకరిస్తూ, సదరు హెచ్చరిక నోటీసు జారీ చేసిన ఇరువురు ధాకా కోటిరెడ్డి మరియు వారి శ్రీమతి ధాకా అనురాధ సగభాగం వుంది అనిన్నూ, వారి సమిష్టి సమభాగంన్ను వుంది అనిన్నూ, వారి అవసరముల రీత్యా సముచితమైన ప్రతిఫలముకున్నూ, చట్టబద్ధమైన తగు రీతిన అమ్ముటకు క్రయమైన విక్రయ అగ్రిమెంటుకు ఆసక్తి చూపిన కొనుగోలుదారుల తోటి విక్రయ అగ్రిమెంట్ ఏర్పాటు చేసుకొనియున్నారు అని తెలియజేశారు. హక్కులు లేనివారు ఇతర భాగస్తుల యొక్క హక్కును వారికి తెలియకుండా అమ్ముకోవటం చట్టప్రకారం నేరం. సదరు ప్రకటన ద్వారా ఎంత ప్రతిఫలం అని గాని, ఎంత బయానా అని గాని, ఎవరికి అని గాని, తెలియజేయకపోవటం కూడా సదరు ధాకా కోటిరెడ్డి మరియు అతని శ్రీమతి ధాకా అనురాధా గార్ల దుష్టబుద్ధికి నిదర్శనంగా భావించాలి అని సదరు పేరు తెలపని కొనుగోలుదారునికి మరియు ఇతరులకు ఈ ఖండన ద్వారా సంపూర్ణంగా తెలియజేస్తున్నాము. సదరు ధాకా కోటిరెడ్డి గాని ఆయన భార్య శ్రీమతి ధాకా అనురాధా గాని **మెస్సర్స్ అనిల్‌కుమార్‌రెడ్డి & అసోసియేట్స్** అను భాగస్వామ్య సంస్థ ఆస్తులు ఇతరులకు అమ్ముటకు హక్కులేదు. వారితో ఎవరైనను గతంలో గాని భవిష్యత్తులోగాని ఎలాంటి లావాదేవీలు జరిగినా చెల్లవు మరియు మా కక్షిదారులు తీసుకొను ఎటువంటి సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులు కాగలరు. ఇంతేకాకుండా సదరు హెచ్చరిక నోటీసు ద్వారా ధాకా కోటిరెడ్డి మరియు అతని భార్య శ్రీమతి ధాకా అనురాధ ఒక ఉచిత సలహా ఇచ్చినారు. అది ఏమనగా నా కక్షిదారులు వారి సగభాగం కంటే ఎక్కువ ఆస్తికి ఏదైనా లావాదేవీలు జరిగిన ఎడల అవి వారిపై బద్ధకింపజాలవు అని చెప్పడం జరిగినది. ఇన్ని తెలిసిన హెచ్చరిక నోటీసు జారీ చేసినవారు వారి పరిధి తెలుసుకోకుండా ఫర్మ్ ఆస్తిని అమ్మటం, ఫర్మ్ పేరును బజారుకీడ్చడం ఇలాంటి దుర్బుద్ధితో కూడిన దుశ్చర్యలను నమ్మవద్దని తెలియజేయుచున్నాము.

**టి.వి.సాయి ఆదిత్య, B.B.A., L.L.B. (Hon's)**
టి.వి.శ్రీనివాసరావు, అడ్వకేటు గారి కార్యాలయము
డి.నెం.16/10/46, శ్రీహరినగర్, నెల్లూరు.

# నగరాభివృద్ధికి.. భారీ బడ్జెట్

• 473.31 కోట్లు కేటాయింపు



బడ్జెట్‌ను ఆమోదిస్తున్న మేయర్ సుజాత

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులకోసం మార్చి 31న జరిగిన సమావేశంలో 473, 31,30,000 రూపాయలను బడ్జెట్‌గా కేటాయించారు. కార్పొరేషన్ మేయర్ దేవరకొండ సుజాత అధ్యక్షతన కార్పొరేషన్ కార్యాలయ సమావేశమందిరంలో జరిగిన సమావేశంలో 2026–27 సంవత్సరానికి ఈ కేటాయింపులు జరిగాయి. బడ్జెట్ అంచనాలు ప్రారంభ నిల్వ 126,40,60,239 రూపాయలతో, జమలు 366,35,92,000 రూపాయలతో కలిపి మొత్తం రూ. 492,76,52,239 కోట్లు జమలుగా ప్రతిపాదించి, అందుకు అనుగుణంగా రూ.473 కోట్లా 31 లక్షలా 30వేల రూపాయల ఖర్చుల అంచనాతో బడ్జెట్‌ను రూపొందించారు. కౌన్సిల్ సభ్యులందరి సమక్షంలో బడ్జెట్ ఆమోదించా మని మేయర్ ప్రకటించారు.

# ఆలయాల పనులపై ఆనం సమీక్ష

జిల్లాలో కొత్తగా చేపట్టిన పలు ఆలయాల పునర్నిర్మాణ పనులపై రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మంగళవారం నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో సంబంధిత అధికారులు, ఇఓలతో సమీక్షించారు. ఆలయాల ఆస్తుల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. దేవాదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ అజాద్, జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

# మార్కెట్‌యార్డుకు ప్రణాళికలు

నెల్లూరు నగరంలోని నవాబుపేట మార్కెట్ యార్డును మంత్రి నారాయణ బుధవారం సందర్శించారు. అక్కడ ఏర్పాటు కాబోతున్న అత్యాధునిక మార్కెట్ కోసం అధికారులు రూపొందించిన ప్రణాళికలను పరిశీలించి, పలు మార్పులు, సూచనలు చేశారు. మార్కెట్ యార్డును అత్యాధునిక సౌకర్యాలతో నగరానికే ఒక మకుటంలా తీర్చిదిద్దుతామని నారాయణ చెప్పారు.

# పశు ఔషధ కేంద్రాలు

జిల్లాకు కొత్తగా 9 పశు ఔషధ విక్రయ కేంద్రాలు మంజూరయ్యాయని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వాటిని మంజూరు చేసిందని, కనుక ఆ కేంద్రాలను త్వరగా ప్రారంభించేందుకు తగు చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధకశాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌తో జరిగిన ఆ సమావేశంలో పశు సంవర్థక శాఖ జేడీ రమేష్‌నాయక్, ఏ.డీ మధులత, డీసీఓ గురప్ప తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మూలస్థానేశ్వరుని...

# హుండీ రాబడి..8 లక్షలు

నెల్లూరు మూలాపేటలోని శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవాలయం హుండీలను మార్చి 26న లెక్కించారు. 104 రోజులకు స్వామివారి భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ రాబడి 8,94,815 రూపాయలు వచ్చిందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

# నెల్లూరు కబుర్లు

# బీసీ భవనానికి.. కోటి విరాళం



కలెక్టర్‌కి విరాళం చెక్కును అందజేస్తున్న మంత్రి నారాయణ అల్లుడు గంటా రవితేజ

నెల్లూరులోని కాపు భవన నిర్మాణానికి ఇటీవల మంత్రి నారాయణ 2 కోట్ల రూపాయలు, షాదీ మంజిల్‌కి 50 లక్షలు విరాళమిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా నగరంలో బీసీ భవన నిర్మాణ పనుల కోసం కోటి రూపాయల విరాళం అందజేయడంతో బీసీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి నారాయణ అల్లుడు గంటా రవితేజ, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర తదితర బీసీ నాయకులు ఆమేరకు మంత్రి అందజేసిన కోటి రూపాయల చెక్కును ఇటీవల జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లకు అందజేశారు. సమాజంలోని అన్ని వర్గాలకు ఆత్మగౌరవ భవనాలు అందుబాటులో ఉండాలన్నదే తమ ఆశయమని గంటా రవితేజ ఈ సందర్భంగా తెలిపారు. నగర మేయర్ దేవరకొండ సుజాత, రాష్ట్ర ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ జెడ్.శివప్రసాద్, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు ధర్మవరపు సుబ్బారావు, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి



శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న మంత్రి నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి

శ్రీరామనవమి పర్వదినాన్ని నగరప్రజలు ఆనందంగా జరుపుకున్నారు. అన్ని రామమందిరాలు, హనుమ ఆలయాల్లో వేడుకలు జరిగాయి. ప్రత్యేకించి శబరి శ్రీరామక్షేత్రంలో సీతారాములకు విశేష పూజలు, సేవలు జరిగాయి. ఈ సందర్భంగా పలు ఆలయాలను సందర్శించిన మంత్రి నారాయణ సతీమణి రమాదేవి మాట్లాడుతూ, సీతమ్మతల్లి ఓర్పు మహిళలందరికీ స్ఫూర్తి దాయకమన్నారు. అయోధ్య రామయ్య చల్లని చూపుతో రాష్ట్రానికి స్వర్ణయుగం రావాలని ఆకాంక్షిస్తూ ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు.

# మహావీర్ జయంతి



భగవాన్ మహావీర్ జయంతి వేడుకలు మంగళవారం నెల్లూరు నగరంలో భక్తిశ్రద్ధలతో జరిగాయి. జైనులు ఉత్సాహంగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. జైన్ శ్వేతాంబర్‌మూర్తి పూజక్ సంఘం ఆధ్వర్యంలో, స్థానిక మండపాలవీధిలోని జైన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహావీర్ విగ్రహాన్ని ఊరేగించి, గురుదేవ్ భద్రబాహు విజయ్‌జీ మహారాజ్ సారథ్యంలో ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం జరిగిన ఆధ్యాత్మిక ప్రసంగాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

# ఓటు హక్కు నమోదు

జిల్లాలో 18 ఏళ్లు నిండిన వారంతా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని, ఆమేరకు రాజకీయపార్టీల ప్రతినిధులు తగు అవగాహన కలిగించాలని జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్ తెలిపారు. మార్చి 26న నెల్లూరు కలెక్టరేట్‌లో ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ, ఓటు హక్కు నమోదు ప్రాధాన్యతను వివరించారు.

జిల్లాలో మంచినీటి వనరులకు

# రూ.103.38 కోట్లు



జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

జిల్లాలో తాగునీటి ఎద్దడిని పూర్తిగా నివారించేందుకు 197 తాగునీటి పనులకు రూ. 103.38 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. మార్చి 30న జిల్లాలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొన్న గ్రామాల్లో నీటి వనరుల పరిస్థితిని అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంచినీటి వనరుల బాగుకు ఉమ్మడి నెల్లూరుజిల్లాలోని ఆత్మకూరు నియోజకవర్గంలో 36 పనులకు 13.43 కోట్లు, గూడూరు నియోజకవర్గంలో 16 పనులకు 7.44కోట్లు ప్రభుత్వం కేటాయించిందన్నారు. అదేవిధంగా, కావలి నియోజవర్గంలో 2 పనులకు 14.76 కోట్లు, కోవూరులో 34 పనులకు 22.26 కోట్లు, నెల్లూరు రూరల్‌లో 13 పనులకు 4.11 కోట్లు, సర్వేపల్లి 44 పనులకు 13.26 కోట్లు, ఉదయగిరి 40 పనులకు 23.72 కోట్లు, వెంకటగిరి 12 పనులకు 4.36 కోట్లు మొత్తం 103.38 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఇంటింటికి కుళాయి కనెక్షన్ల ఏర్పాటు, ఓవర్‌హెడ్ ట్యాంకుల రిపేర్లు, నూతన ట్యాంకుల నిర్మాణం, నిరుపయోగంగా ఉన్న సమగ్ర గ్రామీణ నీటి పథకాలను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

జాతీయస్థాయి ఆర్చరీకి..

# 'డా.కిషోర్స్ రత్నం' విద్యార్థులు




విద్యార్థినులను అభినందిస్తున్న రామ్మూర్తినాయుడు

ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారు ఇటీవల నూజివీడులో నిర్వహించిన ఆర్చరీ పోటీలకు నెల్లూరులోని డా. కిషోర్స్ రోషిణి రత్నం హైస్కూల్‌కి చెందిన విద్యార్థినులు ఎంపికయ్యారు. ఆ స్కూల్ 8వ తరగతి విద్యార్థిని కె.మోక్ష ఇండియన్ బో విభాగంలోను, 7వ తరగతి విద్యార్థిని పి.భావజ్ఞ హంసిని రికర్వ్ విభాగంలోనూ రాష్ట్రస్థాయి పోటీలలో గెలుపొంది. గుంటూరు జిల్లా నంబూరులో నిర్వహించే మినీ నేషనల్స్ పోటీలకి అర్హత సాధించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల డైరెక్టర్లు డా.కృష్ణకిశోర్, వాసంతి విద్యార్థులను అభినందించారు. జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్ మణిమాల తదితరులు ఆ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

# జేఏసీ నిరసనలు



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు

విద్యుత్ బస్సుల పేరుతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్టీసీకి చెందిన ఆస్తులను ప్రైవేట్‌కంపెనీలకు ధారాదత్తం చేసే యత్నాలు చేయడం దారుణమంటూ జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) నాయకుల ఆధ్వర్యంలో మార్చి 31న నెల్లూరులో ఆర్టీసీ కార్మిక సంఘాల వారు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. మంగళవారంతో తమ ఆందోళనలు 50 రోజులకు చేరుకున్నాయన్నారు. ఇకనైనా ప్రభుత్వాలు విద్యుత్ బస్సులను ఆర్టీసీకే కేటాయించాలని వారు కోరారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ (జోనల్) అధ్యక్షుడు పద్మారావు, ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు కృష్ణారావు, జిల్లా నాయకులు షబ్బీర్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# మునిసిపల్ కార్మికుల ఆందోళన

తమకు జీతాలు పెంచాలంటూ మునిసిపల్ కార్మికులు మార్చి 31న నెల్లూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. తమకు 12వ పీఆర్‌సి ద్వారా జీతాలు పెంచాలని వారు డిమాండ్ చేశారు. ఆ మేరకు జేసీ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పించారు. సీఐటియు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో యూనియన్ నాయకుడు పెంచలనరసయ్య, సునీల్‌కుమార్; సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# 5 కోట్లతో.. బాలికల హైస్కూల్

## - - - మంత్రి నారాయణ హామీ - - -



విద్యాశాఖాధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న మంత్రి నారాయణ

నగరంలోని పొదలకూరురోడ్డులోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌ను మంత్రి నారాయణ ఇటీవల పరిశీలించారు. విద్యాశాఖాధికారులతో అభివృద్ధి పనులను సమీక్ష నిర్వహించారు. ఈ స్కూల్‌ను రూ. 5 కోట్ల భారీ వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. యువనేత లోకేష్ విజన్‌కు అనుగుణంగా నెల్లూరు నగర కార్పొరేషన్ పరిధిలోని అన్ని స్కూళ్లను మూడేళ్లలో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా మారుస్తామన్నారు. ఏప్రిల్ 15 నుంచే ఈ ఆధునీకరణ పనులు యుద్ధప్రాతిపదికన ప్రారంభమవుతాయని చెప్పారు. అందుకు సహకరిస్తున్న ఏఎంఆర్ కన్‌స్ట్రక్షన్ యాజమాన్యాన్ని మంత్రి అభినందించారు. త్వరలోనే పేద విద్యార్థులకు మంత్రి లోకేష్ చేతులమీదుగా నారాయణ విద్యాసంస్థల తరపున సైకిళ్ల పంపిణీ చేపడతామని కూడా మంత్రి తెలిపారు. ప్రభుత్వ బడులకు కార్పొరేట్ కళ తెస్తున్నారంటూ టీడీపీ నాయకుడు గిరిధర్‌రెడ్డి మంత్రిని కొనియాడారు. కమిషనర్ నందన్, జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీ రావు, మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

### బాధితునికి ఇల్లు కట్టించి ఇచ్చిన మంత్రి :

నెల్లూరు నగరంలోని 53వ డివిజన్ వారధి సెంటర్ వద్ద గతనెలలో ప్రమాదవశాత్తు డ్రైనేజీ ట్యాంకర్ ఢీకొని ఇల్లు కోల్పోయిన మౌలాలి కుటుంబానికి మంత్రి నారాయణ అండగా నిలిచారు. నెల రోజుల్లోనే బాధితునికి మానవతా దృక్పథంతో తన సొంత నిధులతో కొత్త ఇంటిని నిర్మించి ఇచ్చారు. దీంతో స్థానికులు మంత్రి ఔదార్యాన్ని ప్రశంసించారు. ఆ ఇంటి గృహప్రవేశానికి వచ్చిన మంత్రి నారాయణ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన పీ-4 కార్యక్రమం ద్వారా సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్నవారు, అట్టడుగున ఉన్న పేదలను ఆదుకోవాలని పిలుపునిచ్చారు. డిప్యూటి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## 'జల్‌జీవన్' మిషన్ ద్వారా..

# రాష్ట్రానికి కేంద్రం నిధుల వెల్లువ!

## మంత్రి ఆనం వెల్లడి

జల్జీవన్ మిషన్ ద్వారా రాష్ట్రానికి కేంద్రం నుంచి నిధులు భారీగా వస్తున్నాయని, రూ. 1814.71 కోట్లతో 3000 పనులను రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. అందులో భాగంగా ఆత్మకూరు నియోజకవర్గంలో 36 పనులకు 13.43 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీ కార్యాలయంలో మార్చి 30న పీ4 కార్యక్రమంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, వారి తనయ ఆనం లీలా కైవల్యారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ, నెల్లూరు జిల్లాకు 197 తాగునీటి పనులకు 103 కోట్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీ చేసిందన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో 3373 బంగారు కుటుంబాలను గుర్తించి, వారికి తోడుగా నిలిచేందుకు 729 మంది మార్గదర్శిలు ఆ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారని ఆయన తెలిపారు. లీలా కైవల్యారెడ్డి మాట్లా డుతూ, పీ4 కార్యక్రమం స్ఫూర్తిగా తమ తండ్రి ఆలోచనల మేరకు ఈ ప్రాంత ప్రజలకు సేవ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.



మార్గదర్శులకి ప్రశంసాపత్రాలని అందజేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

## ఉపాధ్యాయుల ధర్నా

ప్రభుత్వం ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు సంబంధించి ఇవ్వాల్సిన బకాయిలను మంజూరు చేయించాలని, దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు తీర్చాలని కోరుతూ బీటీఏ (బహుజన టీచర్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో మార్చి 30న నెల్లూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. బీటీఏ జిల్లా అధ్యక్షుడు మణి సుబ్బు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్, నాయకులు ప్రసాద్, వేమయ్య, మనోజ్ కుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.









పుణ్య సంస్మరణ

మాన్యుడు, మరపురాని నేత

శ్రీ సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి గారు

కీర్తిశేషులై ఏప్రిల్ 6వ తేదీకి 43 సంవత్సరాలు గడవనున్న సందర్భంగా
ఆ పుణ్యమూర్తిని స్మరిస్తూ...

వారి పవిత్రాత్మకు భక్త్యంజలి ఘటిస్తున్నాము.

కుమారులు: సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి - జ్యోతి
సర్వేపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు

లేట్ సోమిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

కుమార్తెలు - అల్లుళ్ళు
కట్టంరెడ్డి రాణీసంయుక్త - రాధాకృష్ణారెడ్డి
కేతిరెడ్డి ఉషారాణి - రామకోటారెడ్డి

| మనుమలు | - | మనుమరాండ్రు | మునిమనుమలు | మునిమనుమరాండ్రు |
|---|---|---|---|---|
| సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి | - | శ్రుతి | యల్లా శర్విన్ | యల్లా సంజన |
| డా॥ సోమిరెడ్డి అర్జున్‌రెడ్డి | - | డా॥ లక్ష్మీ ఐషిత | కేతిరెడ్డి శ్రీమన్ | సోమిరెడ్డి శివాని |
| సన్నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి | - | నీలిమ | నిమ్మ ధీర్ | కేతిరెడ్డి శ్రితిక |
| నిమ్మ కౌశిక్‌రెడ్డి | - | డా॥ సింధు | కేతిరెడ్డి శ్రీవంత్ | కట్టంరెడ్డి శ్రీశాన్వి |
| యల్లా సనత్‌రెడ్డి | - | షాలిని | సన్నారెడ్డి రాయల్ భార్గవ్ | కట్టంరెడ్డి హవిష |
| డా॥ కేతిరెడ్డి కళాధర్‌రెడ్డి | | | నిమ్మ నరేన్ | సన్నారెడ్డి నిరుక్తలేఖ |
| కేతిరెడ్డి శశిధర్‌రెడ్డి | - | కీర్తి | సోమిరెడ్డి రణదేవ్ | సోమిరెడ్డి అమైరా |
| కట్టంరెడ్డి విక్రమ్‌రెడ్డి | - | స్నిగ్ధ | సోమిరెడ్డి అగస్త్య | సోమిరెడ్డి లక్ష్మీ ధాత్రి |

# జిల్లాలో ఉత్సాహంగా.. టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మార్చి 29న జిల్లాలో ఉత్సాహంగా జరిగాయి. టీడీపీ నాయకులు, తెలుగు తమ్ముళ్ళు అందరూ సంబరంగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఆత్మకూరులో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు నగరంలో మంత్రి డా.పొంగూరు నారాయణతో పాటు ఆయా ప్రాంతాల్లో టీడీపీ నేతల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. రాష్ట్రానికి ఎన్టీఆర్ చేసిన సేవలు అపూర్వమని, ఆ స్ఫూర్తితోనే నవశకానికి నాంది పలుకుతామని నాయకులు, కార్యకర్తలు చెప్పారు.



ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ భూమి పూజలో పాల్గొన్న మంత్రి ఆనం

## పేదల కోసం పుట్టిన పార్టీ - మంత్రి ఆనం

తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆత్మకూరు పట్టణంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సారధ్యంలో అట్టహాసంగా జరిగాయి. పార్టీ వ్యవస్థాపకుడు, స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహ ఏర్పాటుకు మంత్రి ఆనం భూమి పూజ–శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ అంటే క్రమ శిక్షణకు, నిబద్ధతకు మారుపేరన్నారు. యువనేత నారా లోకేష్ ఆధ్వర్యంలో కార్యకర్తల సంక్షేమానికి అగ్ర తాంబూలం ఇచ్చారన్నారు. సమాజమే దేవాలయం...ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో పేదల కోసం ఆవిర్భవించిన పార్టీ తెలుగుదేశమని, ప్రపంచవ్యాప్తంగా తెలుగోడి సత్తా చాటిన పార్టీ తెలుగుదేశమేనని అన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి నారాయణ, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు

## ఆంధ్రుల ఆత్మగౌరవం - మంత్రి పొంగూరు

ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారని, ప్రతి పేదవాడికి కూడు –గూడు–గుడ్డ ఉండాలనే సత్సంకల్పంతో ఆయన ప్రారంభించిన టీడీపీ, ఆ మహనీయుని స్ఫూర్తితో నేటికీ ముందుకు సాగుతోందని అన్నారు. నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో జరిగిన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, నెల్లూరు నగరాన్ని మోడల్‌సిటీగా తీర్చిదిద్దేందుకు అహరహం కృషి చేస్తున్నామని మంత్రి నారాయణ చెప్పారు. నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మేయర్ సుజాత, డిప్యూటి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు



విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, పక్కన టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, మాజీ మంత్రి తాళ్ళపాక రమేష్‌రెడ్డి

## బడుగు వర్గాలకు ఆయనే అండ - ఎమ్మెల్సీ బీద

నెల్లూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో, మాజీమంత్రి తాళ్లపాక రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ, స్వర్గీయ నందమూరి తారక రామారావు పార్టీని స్థాపించి, బడుగు బలహీనవర్గాల ప్రజలకు అండగా నిలిచారని, పేదలు, మహిళల అభ్యున్నతికి ఎన్టీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

## మహనీయుడు ఎన్టీఆర్ - టీడీపీ నాయకులు

టీడీపీ ఆవిర్భావ దినోత్సవాల్లో ఎన్టీఆర్ సేవలను నాయకులందరూ స్మరించుకున్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండలాల్లో, అనేకప్రాంతాల్లో ఈ వేడుకలు జరిగాయి. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులు అందరూ పాల్గొన్నారు. నెల్లూరురూరల్‌లో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోదరుడు గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో, కావలిలో దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, సర్వేపల్లిలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోవూరులో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, గూడూరులో పాశం సునీల్, వెంకటగిరిలో కురుగొండ్ల రామకృష్ణ, ఉదయగిరిలో కాకర్ల సురేష్ తదితరుల సారధ్యంలో ఆవిర్భావ దినోత్సవాలు ఆనందోత్సవాలుగా జరిగాయి.

# గూడూరు డివిజన్

## పి4 దాతలకి అవార్డులు



'మార్గదర్శి'లకి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలన లక్ష్యంగా ప్రవేశపెట్టిన పి4 పథకం తీసుకొచ్చి ఏడాది అవుతున్న సందర్భంగా గూడూరు మునిసిపల్ కార్యాలయంలో ఇటీవల సమావేశం ఏర్పాటు చేసి దాతలకు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ చేతులమీదుగా అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలను ధనికులు దత్తత తీసుకునే కార్యక్రమంలో భాగంగా పి4ను ప్రారంభించారన్నారు. పెన్వర్ సీ ప్రొడక్ట్స్ వారు రెట్టపల్లి గ్రామంలోని హైస్కూల్‌లో అదనపు భవనం నిర్మించారు. దిత్వా తుఫాను సమయంలో నాయకులు నెలబల్లి భాస్కర్‌రెడ్డి అక్కడున్న పేదవారికి భోజనం, శానిటేషన్ అందించారన్నారు. సంయుక్త సేవాసంస్థ వారు పట్టణం పరిధిలో సెంట్రల్ లైటింగ్, నేమ్ బోర్డ్స్, ప్యాచ్ వర్క్స్ చేశారన్నారు. వీరి సేవలను ప్రభుత్వం గుర్తించి వారికి ఈరోజు అవార్డులను అందించిందన్నారు.

## అంగన్వాడీలకు వేతనాలు పెంచాలి



సీడీపీఓకి వినతిపత్రం సమర్పిస్తున్న అంగన్‌వాడీలు

ఏ.పి.అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సి.ఐ.టి.యు) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గత నెల 31న అంగన్వాడీ కార్యకర్తలు, నాయకులు గూడూరులోని ప్రాజెక్టు ఆఫీస్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, హెల్పర్ల ప్రమోషన్లకు ఇచ్చిన గైడ్‌లైన్స్ జీ.వో నెంబరు 5ను సవరించాలని, మే నెల అంతా పూర్తిగా వేసవి సెలవులు ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం సి.డి.పి.ఓ ఎస్.కె.మహబూబీకి వినతి పత్రం సమర్పించారు. అంగన్వాడి అధ్యక్ష,కార్యదర్శులు ఏ.ఇంద్రావతి, బి.ఎస్.ప్రభావతి, గూడూరు పట్టణ సి.ఐ.టి.యు ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య, అంగన్వాడి సెక్టార్ లీడర్లు, టీచర్లు,హెల్పర్స్ పాల్గొన్నారు.



సర్వే నిర్వహిస్తున్న కె.వి.పి.ఎస్ కమిటీ సభ్యులు

## కుల వివక్ష నిర్మూలనే.. కె.వి.పి.ఎస్ లక్ష్యం

కుల వివక్షతను నిర్మూలించడమే కె.వి.పి.ఎస్ లక్ష్యమని కె.వి.పి.ఎస్ మండల కార్యదర్శి ఎంబేటి చంద్రయ్య పేర్కొన్నారు. గూడూరు మండలం, విందూరు గ్రామంలోని దళితవాడలో కె.వి.పి.యస్ గూడూరు మండల కమిటీ, దళితుల మీద జరుగుతున్న వివక్ష మీద సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అనాది కాలం నుండి కుల వివక్షతకు గురై ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. కుల వివక్షతను నిర్మూలించేందుకు కె.వి.పి.ఎస్ నిరంతరం పోరాడుతుందన్నారు. కె.వి.పి.ఎస్ అధ్యక్షులు అడపాల ప్రసాద్, సహాయక కార్యదర్శి రాగిపాటి నారాయణ, ట్రేజరర్ యోకుల రమణయ్య, కమిటీ సభ్యులు సి. హెచ్.రమేష్, గండికోటి మధు పాల్గొన్నారు.

## పిఎస్సార్ జన్మదిన వేడుకలు



పొణకా దంపతులని సత్కరిస్తున్న ఎన్.ఎం.యూ నాయకులు

పారిశ్రామికవేత్త పొణకా శివకుమార్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఎన్.ఎం.యూ నాయకులు గూడూరు పట్టణం, కరణాలవీధిలో ఉన్న వారి నివాసానికి చేరుకుని స్వచ్ఛఆంధ్ర సంస్థ మాజీ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ, శివకుమార్‌రెడ్డి దంపతులకు పూలమాల వేసి శాలువాలు కప్పి సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా దేవసేనమ్మ మాట్లాడుతూ.. యూనియన్ అభివృద్ధికి మా వంతు సహకారం ఉంటుందని తెలిపారు. యూనియన్ ఛైర్మెన్ ఖాదర్‌బాషా, డిపో సెక్రటరీ ప్రవీణ్, నాయకులు అహ్మద్ బాషా, ఉమామహేశ్వరి, పార్వతి, శివ, భాస్కర్, హుస్సేన్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

## లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

కార్మిక పోరాటాలతో సాధించి తెచ్చుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను 2026 ఏప్రిల్ 1 నుండి అమలుకు కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ కోడ్‌ల అమలును నిలిపివేయాలని నిరసిస్తూ జాతీయ కార్మిక సంఘాల పిలుపుమేరకు ఏప్రిల్ 1వ తేదిని బ్లాక్‌డేగా పాటిస్తూ... గూడూరులో సి.ఐ.టి.యు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పాత బస్టాండ్‌లోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం తెలియజేశారు. కొత్త చట్టాలు అమలులోకి వస్తే కార్మికులు పూర్తిగా ఇబ్బందుల పాలవుతారని వెంటనే ఆ చట్టాలను నిలుపుదల చేయాలని, డిమాండ్ చేస్తూ సంఘ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. సి.ఐ.టి.యు సీనియర్ నాయకులు టి.వెంకటరామిరెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య,




టవర్‌క్లాక్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సి.ఐ.టి.యు నాయకులు

కెవిపిఎస్ అధ్యక్ష, కార్యదర్శులు అడపాల ప్రసాద్, ఏంబేటి చంద్రయ్య, ఎస్.ముత్యాలయ్య, ఆటో సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైస్‌మిల్లర్లు.. రైతులకి సహకరించాలి

## • మంత్రి నాదెండ్ల మనోహర్



రైస్ మిల్లర్లు బాధ్యతగా వ్యవహరించాలని, రైతులతో సత్సంబంధాలు ఏర్పరచుకొని వారికి తమ వంతు సహకారం అందించాలని రాష్ట్ర పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. మంగళవారం నెల్లూరులోని కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన ప్రాంగణంలో రైస్ మిల్లర్లు, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ప్రసంగించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రస్తుతం రవాణా, గన్ని బ్యాగ్స్ మరియు ఇతర సమస్యలను అధిగమించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. జిల్లాలో సుమారు 170 వరకు దాన్ని సేకరణ కేంద్రాలు ఏర్పాటుచేసి, ఇప్పటివరకు 65 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు ఆయన తెలిపారు. ధాన్యం సేకరణలో సమస్యలు తీరుస్తామన్నారు. నెల్లూరుజిల్లాలో ఈ ఏడాది రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణను లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటి వరకు 60 వేల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం సేకరించామన్నారు. రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి, కలెక్టర్ హిమాన్సు శుక్లా, జేసీ వెంకటేశ్వర్లు, రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు.

## వాకర్స్ ఇంటర్నేషనల్ సమావేశంలో..

# 'నలుబోలు'కి సన్మానం



వాకర్స్ ఇంటర్నేషనల్ కౌన్సిల్ మీటింగ్‌లో పాల్గొన్న నెల్లూరు వాకర్స్ ప్రతినిధులు

వాకర్స్ ఇంటర్నేషనల్ 166వ కౌన్సిల్ మీటింగ్ ఇటీవల ఒడిశా రాష్ట్రంలో రాయగడ జిల్లాలో బిజుపట్నాయక్ ఆడిటోరియం లో జరిగింది. వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ పి.రవిరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డిస్ట్రిక్ట్ గవర్నర్‌లు అందరూ ఈ 3నెలలలో చేసిన ప్రగతిని గురించి వివరించారు. ఈ సందర్భంగా నెల్లూరు నుంచి ఆ సమావేశంలో పాల్గొన్న 203 డిస్ట్రిక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడును వాకర్స్ ప్రతినిధులు సన్మానించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ పాస్ట్ ప్రెసిడెంట్ ఎంవీ సుబ్బారెడ్డి, ఏవీపీ ఏకొల్లు రాఘవరెడ్డి, ఆర్‌సి పలగాటి శ్రీనివాసులురెడ్డి, సెక్రటరీ కోనేటి రవిరాజు, ట్రెజరర్ మునికృష్ణయాదవ్, ఎలెక్ట్ గవర్నర్ ఏ.రాధిక, 12 జిల్లాల వాకర్స్ ప్రతనిధులు పాల్గొన్నారు

## రావి మోహన్‌చౌదరిని

# సత్కరించిన..బీటీఎఫ్ ప్రతినిధులు



రావి మోహన్‌చౌదరిని సత్కరిస్తున్న బిటిఎఫ్ ప్రతినిధులు

తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మార్చి 29న బెంగుళూరు టీడీపీ ఫోరం (బీటీఎఫ్) ఆధ్వర్యంలో రామ్మూర్తినగర్ కన్వెన్షన్ హాలులో వేడుకలు జరిగాయి. తొలుత, పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ విగ్రహానికి ఫోరం వారు పూలమాలలు వేసి, ఎన్టీఆర్ సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఇటీవల ఉగాది సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతులమీదుగా విజయవాడ తుమ్మలపల్లి వారి కళావేదికపై ఉగాది సత్కారాన్ని అందుకున్న కర్ణాటక టీడీపీ కో-ఆర్డినేటర్ రావి మోహన్‌చౌదరిని బిటిఎఫ్ ముఖ్యులు సత్కరించారు. బెంగళూరులోని నందమూరి బాలకృష్ణ సేవాసమితి ప్రతినిధులు ఎన్‌బీకే రవి, దినకర్‌రెడ్డి తదితరులు కూడా మోహన్‌చౌదరిని సన్మానించారు.

# పేదలకి ఉచిత గ్యాస్ కనెక్షన్లు

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఉజ్వల' పథకం కింద మార్చి 30న నెల్లూరుజిల్లా బుచ్చిరెడ్డిపాళెం గిరిజనకాలనీలో బీజేపీ అర్బన్ అధ్యక్షులు రామిశెట్టి కల్యాణ్‌కుమార్ ఆధ్వర్యంలో 20మంది పేదలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సిహెచ్ ప్రవీణారెడ్డి, ఉపాధ్యక్షురాలు కరణం సుభాషిణి మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఈ పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు మంజూరుచేస్తూ ఎందరో పేద మహిళలను ప్రధాని నరేంద్రమోడీ ఆదుకుంటున్నారన్నారు. బీజేపీ సీనియర్ నాయకురాళ్లు రామిశెట్టి రమణమ్మ, బీజేపీ జిల్లా కార్యదర్శి ఆలూరు నాగవేణి, మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి గాలి లక్ష్మీకుమారి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## 'తేమ' పేరుతో

# రైతులను దోచేస్తున్నారు



మంత్రి నాదెండ్లకి వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

వరికి పుట్టినిల్లయిన నెల్లూరుజిల్లాలో రైతాంగాన్ని మిల్లరు, దళారులు దోచుకు తింటున్నారని, ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోళ్ళ వ్యవస్థ అసౌకర్యాలతో మారి, అంతా అస్తవ్యస్తంగా తయారైందని, రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదని బీజేపీ నాయకులు, 'నమామి గంగే' రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ ఆందోళన వ్యక్తం చేశారు. మార్చి 30న నెల్లూరుకు వచ్చిన రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలసి, జిల్లాలో రైతులకు జరుగుతున్న అన్యాయాలను వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద 'తేమ' పేరుతో పుట్టికి 120కేజీల వంతున ధాన్యాన్ని మిల్లర్లు అదనంగా తీసేసు కుంటూ రైతులను దగా చేస్తున్నారన్నారు. దీంతో రైతులు అమ్మే ధాన్యానికి పుట్టికి 4వేల రూపాయల దాకా నష్టపోతున్నారని తెలిపారు. ధాన్యం ఆరబెట్టుకునేందుకు ప్రభుత్వం వెంటనే మొబైల్ పాడి డ్రయ్యర్లను సబ్సిడీ ధరలకు రైతులకు అందజేయాలని ఆయన సూచిం చారు. ఆమేరకు మంత్రికి వినతిపత్రం సమర్పించారు. బీజేపీ నాయకురాళ్ళు రాజేశ్వరి, నాగలక్ష్మి, పద్మ, నాయకులు సుబ్బారెడ్డి, సృజన, విజయ్, సుబ్బయ్య, ఆదినారాయణ, నారాయణరావు పాల్గొన్నారు.

# ఘరానా దొంగ దొరికాడు

నెల్లూరుతో పాటు పలు జిల్లాల్లో గొలుసుచోరీలకు పాల్పడుతున్న ఓ ఘరానా నిందితుడిని నెల్లూరు వేదాయపాళెం పోలీసులు పట్టుకుని, దాదాపు 10 లక్షల రూపాయల విలువజేసే 84 గ్రాముల బరువున్న 3 బంగారు గొలుసులను స్వాధీనం చేసుకున్నారు. ఇన్స్‌పెక్టర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, ఎస్ఐ నవీన్ తదితరులు నగరంలోని తల్పగిరికాలనీ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న అచ్చి గిరిబాబు, అలియాస్ గిరి (నెల్లూరు రూరల్ మండలం ఉప్పుటూరు గ్రామం)ని అదుపులోకి తీసుకుని విచారించగా, వేదాయపాళెం పరిధిలో గొలుసుచోరీలకు పాల్పడినట్లు తేలిందని, రాష్ట్రవ్యాప్తంగా ఆ నిందితునిపై 24కి పైగానే కేసులు కూడా ఉన్నాయని పోలీసులు తెలిపారు.

# 'సంఖ్య'లతో స్నేహం..జీవితాలకి మార్గదర్శకం!

జ్ఞాన నేత్రం – డా. నరసింహారెడ్డి ఊరిమిండి, Dallas, Texas, USA

**గణితం అనే పదం వినగానే చాలా మంది విద్యార్థుల మనసులో చిన్నగా వణుకుపుడుతుంది. సంఖ్యలు, చిహ్నాలు, సమీకరణలు ఇవన్నీ కలిసి ఒకపెద్ద గోడలాకనిపిస్తాయి. కానీ ఆ గోడ నిజానికి మనమే కట్టుకున్నది. ఎందుకంటే, వాస్తవానికి గణితం అంత భయంకరమైనదేమీ కాదు. దానిని అర్థం చేసుకునే మార్గం తప్పితేనే..అది కఠినంగా అనిపిస్తుంది. "తెలిసినది భయం కాదు, తెలియనిదే భయం" అనే లోకోక్తి గణితానికి అచ్చం సరిపోతుంది. సంఖ్యలతో స్నేహం చేయడం మొదలైతే, గణితం మనకు శత్రువు కాదు.. మన రోజువారీ జీవితంలో నడిచే సహచరుడని తెలుస్తుంది. మనం ప్రతిరోజూ చేసే ఎన్నో పనుల్లో గణితం నిశ్శబ్దంగా పనిచేస్తూనే ఉంటుంది. ఇంట్లో బడ్జెట్ వేయడం, వంటలో కొలతలు చూసుకోవడం, ప్రయాణానికి సమయం అంచనా వేసుకోవడం..ఇవన్నీ గణితమే ఈ అనుభవాలను విద్యార్థి గుర్తించిన క్షణం నుంచే గణితం పుస్తకాల్లో ఉన్నది భూతంకాదు, జీవితంలో ఉపకరించే మంచి స్నేహితుడు అని అర్థమవుతుంది.**

గణితాన్ని ఒక భాషగా చూడడం..విద్యార్థికి మొదటి ధైర్యం ఇస్తుంది. అక్షరాల బదులు సంఖ్యలు, వాక్యాల బదులు సమీకరణలు.. ఇలాచూస్తే గణితం నేర్చుకోవడమంటే ఒక కొత్త భాష నేర్చుకోవడమేనని తెలుస్తుంది. భాష నేర్చుకోవడంలో తప్పులు సహజం; గణితంలో కూడా అదే. "తప్పుచేసినవాడే నేర్చుకున్నవాడు" అనే మాటను గుర్తుంచుకుంటే, ప్రతి పొరపాటు ఒక కొత్త అర్థం వైపు తీసుకెళ్తుంది. చాలామంది విద్యార్థులు తప్పు చేస్తే భయపడతారు, కానీ గణితంలో తప్పు అనేది శిక్ష కాదు, మార్గదర్శకం. తప్పు ఎందుకు జరిగిందో తెలుసుకోవడం, దాన్ని సరిచేసుకోవడం వంటివి గణితాన్ని అర్థం చేసుకునే అసలు పద్ధతులు. గురువులు, తల్లిదండ్రులు కూడా విద్యార్థుల తప్పులను శిక్షించకుండా, అవి నేర్చుకునే అవకాశాలుగా చూపితే, విద్యార్థి మనసులోని భయం క్రమంగా కరుగుతుంది. "తప్పు చెయ్యని వాడెవడూ లేడు" అనే సత్యం గణితంలో మరింత స్పష్టంగా కనిపిస్తుంది.

## గణితం అంటే భయపడాల్సిన అవసరమేమీ లేదు :

సాధారణంగా విద్యార్థులకు గణితం ఒక కష్టమైన అంశంగా ఉంటుంది. అయితే, ఒక్కరోజులోనే ఏమీ నేర్చుకోలేం. చిన్న చిన్న విజయాలే పెద్ద ధైర్యాన్ని ఇస్తాయి. గణితంలో ఒక చిన్న సమస్యను పరిష్కరించినప్పుడు వచ్చే ఆనందం, తర్వాతి సమస్యను ఎదుర్కొనే ధైర్యంగా మారుతుంది. పెద్ద సమస్యలతో మొదలు పెట్టడం విద్యార్థిని మరింత భయపెడుతుంది; సులభమైన సమస్యలతో ప్రారంభించి, క్రమంగా కష్టమైనవాటికి వెళ్లడం ఉత్తమ మార్గం. గణితం ఒక పర్వతమైతే, దాన్ని ఎక్కే మార్గం చిన్న చిన్న అడుగులే. ఆ అడుగులు ధైర్యాన్ని పెంచుతాయి, ధైర్యం నమ్మకాన్ని పెంచుతుంది. గణితంపై నమ్మకం పెరగాలంటే, విద్యార్థి మనసులోని సందేహాలను సహజంగా బయటపెట్టే వాతావరణం కూడా అవసరం. తరగతి గదిలో "అడిగితే అమృతం, అడగకపోతే విషం" అనే లోకోక్తి నిజమవుతుంది. సందేహం వచ్చినప్పుడు చెయ్యెత్తి అడగడం, గురువు సమాధానం చెప్పే విధానాన్ని గమనించడం, స్నేహితులతో చర్చించడం..ఇవన్నీ గణితాన్ని అర్థం చేసుకునే ప్రక్రియలో కీలకమైన దశలు. చాలామంది విద్యార్థులు 'ఇది చిన్న ప్రశ్నేమో', 'దీనిని అడిగితే నవ్వుతారేమో" అనే సంకోచంతో నిశ్శబ్దంగా కూర్చుంటారు. ఆ నిశ్శబ్దమే భయానికి మూలం. ప్రశ్న అడిగిన క్షణం నుంచే భయం కరుగుతుంది, అర్థం పెరుగుతుంది. గురువులు కూడా విద్యార్థుల ప్రశ్నలను చిన్నచూపు చూడకుండా, వాటిని ప్రోత్సహిస్తే, గణితం ఒక సంభాషణగా మారుతుంది. సంభాషణ ఉన్న చోట భయం ఉండదు. 'మాటలే మానవుని మిత్రులు' అన్నట్లు, గణితంలో కూడా మాటలే మార్గం చూపుతాయి. విద్యార్థి తన సందేహాలను బయటపెట్టే ధైర్యం పెంచుకున్నప్పుడు, సంఖ్యలపై నమ్మకం కూడా సహజంగానే పెరుగుతుంది. ఎందుకంటే గణితం అనేది ఒంటరిగా పోరాడే విషయం కాదు; కలిసి ఆలోచిస్తే మరింత స్పష్టమయ్యే ఒక గొప్ప శాస్త్రం.

## అర్థం చేసుకుంటే..అంతా సులభమే :

గణితాన్ని కంఠస్థం చేయడం వల్లే ఎక్కువ భయం పుడుతుంది. సూత్రాలు, నిర్వచనాలు, పద్ధతులు, ఇవి ఎందుకు వచ్చాయో అర్థం కాకుండా కేవలం గుర్తు పెట్టుకుంటే, గణితం భారంగా అనిపిస్తుంది. "అర్థం లేని చదువు అంధుడి చేతిలో దీపం" అనే లోకోక్తి ఇక్కడ సరిగ్గా సరిపోతుంది. సూత్రం వెనుక ఉన్న లాజిక్‌ను అర్థం చేసుకున్న విద్యార్థి, సమస్యను ఎలా విభజించాలో నేర్చుకున్న విద్యార్థి, గణితాన్ని ఒక ఆటలా అనుభవిస్తాడు. అర్థం చేసుకున్న జ్ఞానం ఎప్పటికీ నిలుస్తుంది; కంఠస్థం చేసిన జ్ఞానం పరీక్ష ముగిసిన వెంటనే మాయమవుతుంది. గణితాన్ని అర్థం చేసుకోవడం అంటే సంఖ్యలతో వాదన చేయడం కాదు; వాటి స్వభావాన్ని తెలుసుకోవడం. ఒకసారి ఆ స్వభావం అర్థమైతే, సమస్యలు ఎంత పెద్దవైనా విద్యార్థి భయపడడు. గణితం జీవితంలో ఒక భాగమని అర్థం చేసుకున్న విద్యార్థి, పుస్తకంలోని సమస్యను కూడా అదే ధైర్యంతో ఎదుర్కొంటాడు. సంఖ్యలు మనకు దూరంగా ఉన్నవి కావు; మనం వాటిని దూరంగా నెట్టుకున్నాం అంతే. చివరగా, గణిత భయం అనేది మనసులో పుడుతుంది, కానీ నమ్మకం కూడా అక్కడే పుడుతుంది. ధైర్యంగా ప్రయత్నించే విద్యార్థికి గణితం ఎప్పుడూ దూరంకాదు. 'ధైర్యమే దైవం' అనే లోకోక్తి ఇక్కడ మార్గదర్శకం. సంఖ్యలతో స్నేహంచేస్తే, గణితం భయపెట్టే విషయం కాదు. అది.. జీవితాన్ని ముందుకు నడిపించేశక్తి. విద్యార్థి ఆత్మవిశ్వాసం పెరిగినప్పుడు, గణితం పెద్దఅడ్డంకి కాదు, అదే అవకాశాల తలుపు అవుతుంది కూడా. సంఖ్యలపై నమ్మకం పెరిగిన విద్యార్థి, జీవితంలోని ఇతర సమస్యలను కూడా అదే ధైర్యంతో ఎదుర్కొంటాడు. ఎందుకంటే గణితం నేర్పేది కేవలం లెక్కలు కాదు, ఆలోచన, సహనం, పట్టుదల, మరియు సమస్యను విభజించి పరిష్కరించే శక్తి. ఇవన్నీ జీవితాన్ని ముందుకు నడిపించే నిజమైన పాఠాలు!



**వచ్చే వారం :** విజ్ఞానాత్మక ఆలోచన : సరైన ప్రశ్నలు అడగడం అనే కళ!

E-mail: reddyu@gmail.com



## 'కళారత్న' చిన్నికి ఐ.టి కమిషనర్ సత్కారం

ఇటీవల విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా కళారత్న అవార్డు అందుకున్న ప్రముఖ రచయిత, ఆడిటర్ చిన్ని నారాయణరావును ఏప్రిల్ 2వ తేదీన నెల్లూరు రేంజ్ ఆదాయ పన్ను శాఖ కమిషనర్ వి.శ్రీధర్ తన కార్యాలయంలో సత్కరించారు. తన రచనా పటిమతో ఎన్నో అద్భుత పుస్తకాలు రచించిన నారాయణరావు భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

# డీఎస్ఆర్ ట్రస్ట్‌లో.. ఇంటర్ బైపీసీ కోర్సు

## వచ్చే విద్యాసంవత్సరం నుంచే ప్రారంభం

అటు విద్యాదానంలోనూ, ఇటు సామాజిక సేవలోనూ తరిస్తున్న అల్లూరు మండలం నార్త్‌మోపూరు గ్రామంలోని దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్టు (డీఎస్ఆర్ ట్రస్టు)లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్‌మీడియట్ బైపీసీ కోర్సును కూడా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ట్రస్టు ఛైర్మెన్ దేవిరెడ్డి సుధాకర్ రెడ్డి, సద్గురు మధుసూదన్, సాయి స్కూల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు మార్చి 30న ట్రస్టులో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆ విషయం వెల్లడించారు. శ్రీ సత్యసాయి లోక్ సేవా గురుకుల సంస్థ వారి సహకారంతో ఎన్ఐఓఎస్ సిలబస్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్)తో ఈ కోర్సును ప్రారంభించనున్నట్లు సుధాకర్‌రెడ్డి చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు ఎంట్రెన్స్ పరీక్ష పెట్టి, అర్హత సాధించిన30 మంది విద్యార్థులకు ఇంటర్ బైపీసీ కోర్సుతో పాటు, 'నీట్' కోచింగ్‌ని ఉచితంగా ఏర్పాటుచేస్తామని తెలిపారు. 'నీట్'లో అర్హత సాధించిన విద్యార్థులకు మధుసూదన్‌సాయి వైద్య కళాశాలలో ఉచితంగా ఎంబీబీఎస్, నర్సింగ్, ఫార్మా మెడికల్ బీఎస్సీ, ఎంఎస్సీ, పీహెచ్‌డీ కోర్సులతో పాటు హాస్టల్ వసతి కూడా కల్పిస్తామన్నారు. కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ట్రస్టు ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆయన వివరించారు. అదేవిధంగా డీఎస్ఆర్ ట్రస్టు, సత్యసాయి లోక్‌సేవా ట్రస్టు సహకారంతో ఉన్నత వైద్య సేవలను అందించేందుకు ట్రస్ట్ ఆవరణంలోనే 50 పడకల ఆసుపత్రిలో ఎలాంటి ఆపరేషన్లయినా పూర్తిగా ఉచితంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపడతామన్నారు. ఇంకా మెరుగైన వైద్య సేవల కోసం బెంగళూరులోని సత్యసాయి సేవా ట్రస్టులో ఉచితంగా వైద్యసేవలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్ సాయి స్కూల్ తెలంగాణ ఛైర్‌పర్సన్ పూర్ణిమ శంకర్, డీఎస్ఆర్ ట్రస్టు సభ్యులు దేవిరెడ్డి దశరథ రామిరెడ్డి, ట్రస్టు అడ్మిన్ మేనేజర్ అనిల్ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత చౌదరి, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి

# ఎన్‌బీకేఆర్‌లో.. 'ఆక్సియాన్-2కె26' సాంకేతిక సదస్సు

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 2న కళాశాల ఇసిఇ విభాగం ఆధ్వర్యంలో జాతీయస్థాయి 'ఆక్సియాన్-2కె26' సాంకేతిక సదస్సు జరిగింది. ఈ సదస్సులు ముఖ్యవక్తలు మాట్లాడుతూ, సాంకేతిక విద్యతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని సూచించారు. మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో సొసైటీ ఫర్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ రీసెర్చ్ విభాగానికి డైరెక్టర్ జనరల్‌గా ఉన్న ప్రముఖ శాస్త్రవేత్త డా.పి.హనుమంతరావు పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. సాంకేతిక రంగంలో, సాఫ్ట్‌వేర్ రంగాలలో నేడు జరుగుతున్న అభివృద్ధిని అవగాహన చేసుకుంటే విద్యార్థులకు మంచి ఉద్యోగావకాశాలు లభిస్తాయని చెప్పారు. కళాశాల సంచాలకులు డా. వి.విజయకుమార్‌రెడ్డి, మాట్లాడుతూ, ఆధునిక ఇంజనీరింగ్ విద్యలో సమస్య పరిష్కార దృక్పథం అత్యంత కీలకమన్నారు. సబ్జెక్ట్‌లో స్పష్టత ఉన్నప్పుడే ఆవిష్కరణలు సాధ్యమవుతాయని తెలిపారు. డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డా.జి. హరినాథ రెడ్డి మాట్లాడుతూ, సాంకేతికరంగం గణనీయంగా అభివృద్ధి చెందుతున్న నేటిరోజుల్లో యువత సాంకేతికతను, పర్యావరణం-జీవ సమతుల్యతలను కాపాడడానికి కృషిచేయాలన్నారు. ఇసిఇ విభాగాధిపతి డా.కె.నాగిరెడ్డి, ప్రిన్సిపల్ డా.ఎం.శ్రీనివాసులు, డా.ఎస్‌కె మహబూబ్‌బాషా, కార్యక్రమ సమన్వయకర్త డా. జి. నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




సదస్సులో ప్రసంగిస్తున్న ఎన్‌బికెఆర్ సంచాలకులు డా.వి.విజయకుమార్‌రెడ్డి

# సంస్కృత భాషను మరువలేం!

ఎంతో ప్రాచీనమైన మన సంస్కృత భాషను మనం మరచిపోలేమని, నేటికీ ఆ భాష మన జీవితాల్లో కలగలిసిపోయిందని ప్రముఖ రచయిత్రి-అనువాదకురాలు బులుసు నవీన చెప్పారు. ఇప్పటికీ 'శుభోదయం-శుభరాత్రి' వంటి సంస్కృత పదాలు నిత్యజీవితంలో పరిఢవిల్లుతూనే ఉన్నాయన్నారు. చెన్నైలోని వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతినెలా నిర్వహిస్తున్న తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహికలో భాగంగా, ఇటీవల ఆమె 171వ ప్రసంగంగా 'సంస్కృతంలో చమత్కారం' అనే అంశంపై ప్రసంగించి అందరినీ ఆకట్టుకున్నారు. అనేక చమత్కారాలతో పాటు సంస్కృతంలో సమస్యాపూరణాలను హాస్యరసాత్మంగా తెలియజేశారు. చెన్నై టీనగర్‌లోని ఆంధ్రాక్లబ్ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత, వేదిక కార్యదర్శి కందనూరు మధు సభకు స్వాగతం పలకగా, అధ్యక్షులు జేకేరెడ్డి వక్తను సభకు పరిచయం చేశారు. ఎంబీఏ చదివిన తర్వాత, సంస్కృతంలో ఎంఏ పూర్తిచేసి, ఎన్నో డిగ్రీలను నవీన సాధించారని, 'ముత్యాల దీపం' వంటి రచనలను తెలుగు నుండి ఇంగ్లీషులోకి అనువదించారని ఆయన వక్త నవీన చేసిన రచనలను వివరించారు. అనంతరం, ఆమెను వేదిక నిర్వాహకులు సన్మానించారు. చెన్నైలోని అనేకమంది భాషాభిమానులు, సాహిత్యాభిలాషులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



రచయిత్రి బులుసు నవీనని సత్కరిస్తున్న వేదవిజ్ఞాన వేదిక నిర్వాహకులు



## మర్యాదపూర్వక భేటీ..!

ఇటీవల జిల్లాకి వచ్చిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో నెల్లూరు జనసేన నాయకుడు చిట్టమూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి భేటీ అయ్యారు. జిల్లా జనసేన పార్టీకి సంబంధించిన అనేక కీలక అంశాలు వీరిద్దరి మధ్య చర్చకి వచ్చినట్లు సమాచారం.

# ఆర్డీఓ పావనిని.. అభినందించిన కలెక్టర్

వింజమూరులో ఏప్రిల్ 1న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ అధికారిణి (ఆర్డీఓ) బి.పావనిని ఈనెల 2న నెల్లూరులోని తమ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అభినందించారు. ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించడం కోసం 15 రోజులపాటు వింజమూరులోనే ఉండి, రాత్రీ పగలు పూర్తి పర్యవేక్షణతో అన్ని శాఖల అధికారులను సమన్వయపరచి, ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని జయప్రదం చేసినందుకు కలెక్టర్ ఆమెను ప్రశంసించి సన్మానించారు.



ఆర్డీఓ పావనిని సత్కరిస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

## కృష్ణపట్నం పోర్టుకు చేరుకున్న..

# కొత్త 'హై స్పీడ్' బోటు!

జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ప్రత్యేక చొరవతో కాకినాడ హార్బర్ నుంచి నెల్లూరు జిల్లాకు హైస్పీడ్ బోటు వచ్చింది. తమిళనాడు అక్రమబోట్లను నివారించేందుకు, వారి అక్రమ వేటను నిరోధించేందుకు కొత్త బోటును కొనాలని జిల్లా కలెక్టర్ ఆదేశించడంతో, ఆమేరకు మత్స్యశాఖ వారు 326 హెచ్‌పి హైస్పీడ్ బోటును సిద్ధం చేశారు. గంటకు 18కి.మీ. వేగంతో నిరంతరం గస్తీ కాస్తూ, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల మత్స్యకారుల అక్రమ వేటకు అడ్డుకట్టవేసే విధంగా ఈ బోటులో అన్ని ఏర్పాట్లు చేశారు. వీడియో రికార్డింగ్ సౌకర్యం గల బైనాక్యులర్లు, హెవీ ఫోక్స్ లైట్లతో తమిళనాడు, పాండిచ్చేరి మత్స్యకారుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచేందుకు ఈ బోటు ఉపయోగపడుతుంది. ప్రస్తుతం సముద్రతీరంలో మూడు బోట్లతో పహారా కాస్తున్న టాస్క్‌ఫోర్సు బృందాలు.. రాత్రి వేళల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మరో నూతన హైస్పీడ్ బోటు కొనుగోలుకు కూడా కలెక్టర్ ఆదేశించారు.

## వేదగిరి నరసింహస్వామికి..

# వేడుకగా వసంతోత్సవం

నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండపై వెలసివున్న శ్రీ వేదగిరి లక్ష్మీనృసింహ స్వామికి ఈనెల 1న 'చైత్ర పౌర్ణమి' సందర్భంగా వేడుకగా వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో విశేష పూజలతో పాటు, పల్లకిసేవ, గరుడసేవలు కూడా జరిగాయి. ఆలయ ఛైర్మెన్ ఇందుపూరు అచ్యుత్ శంకరరెడ్డి, ఇఓ గోపి పర్యవేక్షించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు.



# శ్రీసిటీని సందర్శించిన తైవాన్ బృందం



రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాల పరిశీలనలో భాగంగా తైవాన్ దేశానికి చెందిన ఐదుగురు వ్యాపార ప్రతినిధుల బృందం మంగళవారం శ్రీసిటీని సందర్శించింది. తైవాన్ నాన్–వోవెన్ ఫాబ్రిక్స్ ఇండస్ట్రీ అసోసియేషన్ (టిఎన్ఎఫ్ఏ) సంస్థ చైర్మన్ షెల్లీ చియన్ నేతృత్వంలో వచ్చిన ఆ బృందానికి శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్‌కామత్ స్వాగతం పలికారు. శ్రీసిటీ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్(బిజినెస్ డెవలప్మెంట్) బోడ్గన్‌జార్జ్ శ్రీసిటీ ప్రత్యేకతలను వివరించారు. శ్రీసిటీ వ్యూహాత్మక స్థానం, వివిధ రంగాల పరిశ్రమలు, అత్యుత్తమ సామాజిక మౌళిక సదుపాయాలను తెలియజేశారు. తైవాన్ కు చెందిన రెచి ప్రెసిషన్ సంస్థ శ్రీసిటీలో డైకిన్‌తో కలిసి ప్లాంట్ ఏర్పాటు చేయడాన్ని వారి దృష్టికి తెచ్చారు. శ్రీసిటీ ప్రణాళికాబద్ధ అభివృద్ధిని, రాష్ట్ర ప్రభుత్వ సహకారాన్ని షిల్లీ చియన్ ప్రస్తుతించారు. శ్రీసిటీ పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ అద్భుతమని కొనియాడారు. తమ పెట్టుబడులకు శ్రీసిటీ అనువైన కేంద్రంగా భావిస్తున్నామని, పరిశ్రమల ఏర్పాటు కోసం తప్పక పరిశీలిస్తామని తెలిపారు. తైవాన్ బృందంతో పాటు ఇన్వెస్ట్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక అభివృద్ధి మండలి ప్రతినిధులు ఈ సందర్శనలో పాల్గొన్నారు.

# ఏపీజేఏసీ గూడూరు నూతన కమిటీ




గూడూరు ఎన్జీవో భవనంలో గత నెల 30వ తేదీ గూడూరు తాలూకా యూనిట్ జేఏసీ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఛైర్మెన్‌గా ఉద్యోగ సంఘాల నుండి ఎస్.వి. శ్రావణ్‌కుమార్, కార్యదర్శిగా ఉపాధ్యాయ సంఘాల నుండి వై.సుబ్రహ్మణ్యంరాజు, కోశాధికారిగా సి. హెచ్. ఉదయ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎస్.శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జాయింట్ సెక్రటరీలుగా పెన్షనర్స్ అసోసియేషన్ నుండి పి.పురుషోత్తమరావు, ఏపి ఎన్‌జిఓల నుండి ఓ.తనూజ్‌కుమార్, ఏపిటిఎఫ్ నుండి బి.శివకుమార్ ఎన్నికయ్యారు. ఈసీ మెంబర్లుగా ఎస్.కె.ఖాదర్‌బాషా, వి.కిరణ్ కుమార్, షేక్ అహ్మద్, మునేంద్ర, లక్ష్మీనారాయణ, భాస్కర్‌రెడ్డి, మురళీమోహన్, కె.రమేష్‌లను ఎన్నుకున్నారు.

# జడ్పీలో స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర

నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయములో ఇటీవల 'స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర' కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రజా పరిషత్ అధ్యక్షులు ఆనం అరుణమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత అవగాహన ర్యాలీ నిర్వహించారు. "చెత్తను ఇంటి నుంచే వేరుచేసి, చెత్త లేకుండా లేదా తక్కువగా ఉత్పత్తి అయ్యే జీవన విధానం అనుస రించడంపై అందరూ అవగాహన కలిగి వుండాలని కోరారు. జడ్పీ సీఇఓ యల్.శ్రీధర్‌రెడ్డి, ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి జె. మోహన్ రావు, జడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

## జొన్నవాడలో..
# శ్రీ వరదరాజస్వామి బ్రహ్మోత్సవాలు



బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడ గ్రామంలో ఉన్న శ్రీ వరద రాజస్వామి వారి వార్షిక బ్రహ్మోత్స వాలకు ఆరంభసూచకంగా సోమ వారం ఉదయం ఆలయ ప్రాంగ ణంలో తాత్కాలిక ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణల నడుమ ఆలయ అర్చకులు పుణ్యాహవచనం, హోమం, ప్రత్యేక పూజ, కలశస్థాపన తదితర కార్యక్రమాలన్నీ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ధ్వజస్తంభాన్ని పవిత్ర ద్రవ్యాలతో శుద్ధి చేసి పట్టు వస్త్రాలు, పుష్పాలతో అలంకరించి ప్రతిష్ఠించారు. మంగళవాద్యాల నడుమ, భక్తుల గోవింద నామస్మరణల మధ్య ఈ ప్రతిష్ఠ కార్యక్రమం సాగింది. సాయంత్రం అంకు రార్పణ కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి ఈ పూజలను పర్యవేక్షించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శి:చుకున్నారు.

# ధాన్యం కొనుగోళ్ళలో దగా!

## వ్యవసాయ కార్మికసంఘం నేతల ధ్వజం



ఆర్డీఓకి వినతిపత్రం సమర్పిస్తున్న కార్మిక సంఘం నాయకులు

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ళలో రైతులకు అడుగడుగునా దగా జరుగుతోందని, రైతులు ఆరుగాలం కష్టించి ధాన్యాన్ని పండిస్తే, మిల్లర్లు–దళారులు దానిని అత్యంత తక్కువ ధరకు లాగేసు కుంటున్నారని, ఈ దోపిడీలను అరికట్టాలని కావలి ఏరియా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. మార్చి 30న ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు టి.మాల్యాద్రి కావలి ఆర్డీఓకి ఆమేరకు వినతిపత్రం ఇచ్చారు. తేమ పేరుతో తరుగు తీసేయా లంటూ రైతులకు మాయమాటలు చెప్పి, వారివద్ద నుంచి ఎక్కువ ధాన్యం తీసుకుని, తక్కువ ధరలే ఇస్తున్నారని ఆయన తెలిపారు. రైతులు పండించిన మొత్తం ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, రైతులు పడుతున్న శ్రమను గుర్తించి బోనస్‌గా క్వింటాలుకు 650 రూపాయలను బోనస్‌గా ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కావలి, జలదంకి మండల రైతు సంఘం నాయకులు ఎం.రాధాకృష్ణయ్య, జి.మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

# 30 ఏళ్ల కల!.. ఎట్టకేలకు ఫలించింది!



'జిల్లా స్వాతంత్ర్య సమర చరిత్ర' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న విఎస్‌యు ఉపకులపతి శ్రీనివాసరావు

## 'జిల్లా స్వాతంత్ర్య సమర చరిత్ర' గ్రంథావిష్కరణ

అనేకమంది ప్రసిద్ధ రచయితలు నెల్లూరుజిల్లా స్వాతంత్ర్య సమరంపై రాసిన వ్యాసాల గ్రంథం దాదాపు 30 ఏళ్ల తర్వాత ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. 1996 మార్చి 17–18 తేదీలలో మల్లంపల్లి సోమశేఖర శర్మ సెంటర్ ఫర్ హిస్టారికల్ స్టడీస్ సంస్థ వారు నెల్లూరులో నిర్వహించిన సమావేశంలో, పలువురు ఆహ్వానిత అధ్యాపకులు చేసిన పత్రసమర్పణ విషయాలు, అనివార్య కారణాల వల్ల మూడుదశాబ్దాల తర్వాత గ్రంథరూపంలో రావడం విశేషం! దాదాపు 500పేజీలు, నాటి స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలు, అనేకానేక ఆసక్తికర విషయాలతో 'నెల్లూరుజిల్లా స్వాతంత్ర్య సమర చరిత్ర (1885–1947)' అనే పేరుతో ముద్రితమైన ఆ అపురూప గ్రంథం విక్రమసింహపురి విశ్వవిద్యాలయంలో ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు చేతులమీదుగా మార్చి 28న ఆవిష్కరణ జరిగింది.

జిల్లా స్వాతంత్ర్యోద్యమ చరిత్రపై ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ వ్యవస్థాపక సభ్యులు డాక్టర్ గిద్దలూరు వేంకటేశ్వరరావు, కాంజీవరం రాధాకృష్ణల ఆధ్వర్యంలో వీఆర్ కళాశాలలో 1996లో ఒక సదస్సు నిర్వహించారు. అప్పట్లో రాధాకృష్ణ నెల్లూరు వీఆర్ కళాశాలలో చరిత్ర విభాగాధిపతిగా ఉండేవారు. ఆ సమావేశానికి ఆయనే సమన్వయకర్త కూడా. ఆ సమావేశంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు డా. బెజవాడ గోపాలరెడ్డి పాల్గొని, ఈ అమూల్యమైన అంశాలన్నిటినీ ఒక గ్రంథరూపంలో ముద్రిస్తే బాగుంటుందని సూచించారని, ఆ స్ఫూర్తితో ఈ పుస్తకాన్ని ముద్రించడం జరిగిందని రాధాకృష్ణ తెలిపారు. గ్రంథ సంపాదక బృందంలో డాక్టర్ లెనిన్ ధనిశెట్టి, ఇద్దరు అధ్యాపకులు పడిన శ్రమ ఇంతకాలం తర్వాత ఫలించిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. గ్రంథావిష్కరణ సభలో ప్రముఖ రచయితలు పెరుగు రామకృష్ణ, బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, లెనిన్లకు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆ గ్రంథ ప్రతులను అందజేశారు. సంఘమిత్ర విద్యా సంస్థల చైర్మన్ రవీంద్రరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, గూడూరు పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్ సురేంద్ర పాల్గొన్నారు.

## టూకీగా...



### గోవిందపల్లిలో మత్స్యకారులకు అవగాహన

కోట మండలం కొత్తపట్నం పంచాయతీ గోవిందపల్లి గ్రామంలో ఈనెల 1న మత్స్యకారులకు అధికారులు అవగాహన సదస్సు నిర్వహించి, సముద్ర ప్రాంతాల్లో భద్రతపై ప్రజలకు వివరించారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై అప్రమ త్తంగా ఉండాలన్నారు. తహశీల్దార్ కె.జయజయరావు, ఎంపీడీఓ దిలీప్‌కుమార్, ఎఫ్‌డీఓ రెడ్డినాయక్ తదితరులు పాల్గొన్నారు.

### సంగంలో అంగన్‌వాడీల ధర్నా

తమ సమస్యలు తీర్చాలంటూ మండల కేంద్రమైన సంగంలో మంగళవారంనాడు అంగన్‌వాడీలు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. సమ్మెకాలపు వేతనం ఇవ్వాలని, అంగన్ వాడీలను ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సీఐటీయు నాయకులు అన్నెం సురేష్ ఆధ్వర్యంలో తహశీల్దార్ సోమ్లానాయక్‌కి ఆమేరకు వినతిపత్రం సమర్పించారు.

### కృష్ణపట్నంలో.. కోదండరామస్వామికి పట్టాభిషేకం

శ్రీరామనవమి వేడుకల సందర్భంగా మార్చి 31న ముత్తుకూరు మండలం కృష్ణపట్నంలోని శ్రీ సీతాసమేత కోదండ రామస్వామికి పట్టాభిషేక మహోత్సవం వైభవోపేతంగా జరిగింది. పెద్దసంఖ్యలో గ్రామస్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మెన్ వై.మురళీబాబు, ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షించారు.

### నెల్లూరు రూరల్ మండల సమావేశం 8న

నెల్లూరు రూరల్ మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 8న ఉదయం 10.30 గంటలకు జరుగు తుందని రూరల్ ఎంపీడీఓ ఎం.వి రమణమ్మ తెలిపారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, జడ్పీటీసీలు, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని ఆమె కోరారు.

### వంగల్లులో గడ్డివామి దగ్ధం

సంగం మండలం వంగల్లు గ్రామంలో మంగళవారం అగ్నిప్రమాదం జరిగి, ఎస్సీకాలనీ నివాసి వెంకటేశ్వర్లు అనే రైతుకు చెందిన గడ్డివామి అగ్నికి ఆహుతైంది. సమచారం అందుకున్న అగ్నిమాపకదళం వారు వెంటనే వచ్చి మంటలను అర్పారు. 5 ఎకరాల ఆ గడ్డివామి దగ్ధం కావడంతో రూ. 30వేల వరకు నష్టం జరిగిందంటూ బాధితుడు వాపోయాడు.

### చెందోడులో.. అగ్నిప్రమాదాల పట్ల జాగ్రత్తలు

ఈ వేసవిలో అగ్నిప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలంటూ మార్చి 31న కోట మండలం చెందోడు గ్రామంలో ప్రజలకు అగ్నిమాపక అధికారి కె.శ్రీనివాసులు అవగాహన కలిగించారు. స్థానిక పాఠశాలలో మాక్‌డ్రిల్ చేసి, అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. స్కూల్ కరెస్పాండెంట్ నీలం సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బుచ్చిలో చలివేంద్రం ప్రారంభం

వేసవి వేడిమి నుంచి ఉపశమనంగా ఉండేందుకు బుచ్చిరెడ్డిపాళెంలో మంగళవారం నాడు బస్టాండ్ సెంటర్‌లో చలివేంద్రం ఏర్పాటుచేసి చల్లటి మంచినీరు అందిస్తున్నారు. బుచ్చి సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి ఈ చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు.

### చేజర్ల ఆరోగ్యకేంద్రం తనిఖీ

మండల కేంద్రమైన చేజర్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మార్చి 31న జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారిణి డాక్టర్ ఏ.ఉమామహేశ్వరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని, ఆరోగ్య కేంద్రాన్ని ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచాలని వైద్యాధికారులకు, సిబ్బందికి చెప్పారు. చేజర్ల వైద్యాధికారి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

### చెర్లోపాళెంలో గ్రామసభ

కోవూరు మండలం చెర్లోపాళెం గ్రామంలో ఈనెల 1న రైతులు, ప్రజలకు సంబంధించిన సమస్యలపై గ్రామసభను నిర్వహించారు. డిప్యూటి తహశీల్దార్ బషీర్ మాట్లాడుతూ, రెవెన్యూ సమస్యలపై లిఖితపూర్వకంగా తెలియజేస్తే వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

# ఉదయగిరి.. ఇక పరిశ్రమల సిరి!

జిల్లాలో వెనుకబడిన మెట్ట ప్రాంతంగా ఉంటూ, పనులు లేక వలసలు పోతున్న ఉదయగిరి ప్రాంతం.. ఇక త్వరలోనే పరిశ్రమల సిరిగా వెలుగొందబోతోందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఈనెల 1న ఆయన నెల్లూరుజిల్లా వింజమూరులో జరిగిన ప్రజావేదిక సభలో మాట్లాడారు. ఒకప్పటి వలసల కేంద్రం..పరిశ్రమలకు గమ్యస్థానంగా మారబోతోందని చెప్పారు. దుత్తలూరులో ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్, ఉదయగిరిలో అనడ్రోన్ సిస్టమ్స్ అనే రెండు రక్షణరంగ పరిశ్రమలు ఏర్పాటుకానున్నాయని, తద్వారా యువతకు ఎన్నో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఉదయగిరి కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. సోమశిల కాలువ నుంచి పాతూరు చెరువుకు నీటిని సరఫరా చేసేందుకు 34 కోట్ల రూపాయలు మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, దేశంలో మరెక్కడా లేని విధంగా నెలకు 4వేల రూపాయల పింఛను అందజేస్తున్న ఏకైక రాష్ట్రం మన ఆంధ్రరాష్ట్రమేనన్నారు. రాష్ట్రం ఎన్ని ఆర్థిక ఇబ్బందులో ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనా పటిమతో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. ఉదయగిరికి రెండు పరిశ్రమలు రావడం సంతోషకరమని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆనందం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉదయగిరి ప్రాంతంలో కోట్లాది రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు.

## వింజమూరు ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



ఉచిత విద్యుత్ సరఫరా లబ్దిదారులకు ధృవపత్రం అందజేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

## చేనేతకారులకు ఉచిత విద్యుత్

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ నేటి నుంచి చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమల్లోకి తీసుకువస్తున్నట్టు ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రకటించారు. 93 వేల చేనేత మగ్గాలకు 200 యూనిట్ల వరకూ, 11,488 పవర్ లూమ్‌లకు 500 యూనిట్ల వరకూ ఉచితంగా విద్యుత్ అందిస్తామని తెలిపారు. దీని కోసం మొత్తం 153 కోట్లను వ్యయం చేస్తున్నామన్నారు. నేతన్న సంక్షేమానికి.. వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. చేనేతల సంక్షేమం కోసం రూ.5 కోట్లతో త్రిఫ్ట్ ఫండ్ ఏర్పాటు చేశామని.. 55 ఏళ్లకే పెన్షన్ కూడా అందిస్తున్నట్టు తెలిపారు. నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ పథకం కింద 5 చోట్ల హ్యాండ్లూమ్ క్లస్టర్లను ప్రారంభించబోతున్నట్టు సీఎం ప్రకటించారు. అనంతరం లబ్దిదారులకు ఉచిత విద్యుత్ సరఫరా ధృవపత్రాలను అందించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఎన్ఎండి ఫరూక్, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబుకి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ హిమాన్షు

## కలెక్టర్‌కి..సీఎం అభినందనలు

నెల్లూరు జిల్లాలో కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆధ్వర్యంలో వినూత్నంగా అమలుచేస్తున్న 'వన్ మంత్... వన్ విలేజ్... ఫోర్ విజిట్స్' కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబునాయుడు వింజమూరు ప్రజావేదిక సభలో మెచ్చుకున్నారు. ఆ సభలో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ఈ కార్యక్రమంపై ప్రస్తావించారు. ఒక నెలలో ఒక గ్రామంలో నాలుగు సార్లు రెవెన్యూ అధికారులు పర్యటించి ఆ గ్రామంలో ఉన్న సమస్యలను పూర్తిగా పరిష్కరించేందుకు కృషి చేస్తారని, దీంతో రెవెన్యూ సమస్యలు చాలావరకు తగ్గుముఖం పడతాయని సీఎం అన్నారు. ఈ కార్యక్రమాన్ని వినూత్నంగా ప్రవేశపెట్టిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

# అర్థంపర్థం లేని ఆరోపణలు వద్దు

## • వైసీపీ నేతలకు మంత్రి నారాయణ హితవు



విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి పొంగూరు నారాయణ

ఆంధ్ర రాష్ట్రప్రజలకు అద్భుతమైన భవిష్యత్తును ఇవ్వాలనే ఆకాంక్షతోనే రాజధాని అమరావతి నిర్మాణం జరుగుతోందని, ఇప్పటికే అక్కడ 70,790 ప్లాట్లు కేటాయించామని, కేవలం 650 మందికి మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని రాష్ట్ర పురపాలక మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. ఈనెల 1న ఆయన నెల్లూరులో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, అమరావతిపై వైసీపీ నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండించారు. డేటా తెలుసుకోకుండా మాట్లాడటాన్ని వైసీపీ నాయకులు ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. తన బొమ్మ కోసం సర్వే రాళ్లపై రూ 750 కోట్లు, పాస్‌బుక్‌ల కోసం రూ 25 కోట్లు ప్రజా ధనాన్ని తగలేసిన జగన్, తన సొంత విలాసం కోసం రుషికొండ ప్యాలెస్ కట్టుకున్నారని ఆయన ఆరోపించారు. హైదరాబాద్ కంటే అద్భుతంగా అంతర్జాతీయ స్థాయి క్రీడా స్టేడియంలు, ఎయిర్‌పోర్ట్‌లతో అమరావతిని తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. 2028 ఆగస్టు నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజధాని నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. లోక్‌సభలో బిల్లు పెట్టిన రోజే ప్రజలను పక్కదారి పట్టించేందుకు జగన్ 'మావిగన్ పేరుతో మరో కుట్రకు తెరలేపారని, అలాంటి అబద్ధాలను ప్రజలు నమ్మరని ఆయన అన్నారు. ఈ సమావేశంలో నగర మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాళ్ళపాక అనూరాధ, రాష్ట్ర వేర్‌హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ కపిర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్ మాటలు విని..

# పిల్లలు నవ్వుకుంటున్నారు!

## • కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

ఈనెల 1న జగన్ మాటలను విని పిల్లలు నవ్వుకుంటున్నారని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. రాజధాని అమరావతి విషయంలో జగన్ వ్యాఖ్యలను ఆయన ప్రస్తావిస్తూ, ఆయన పైవిధంగా అన్నారు. గురువారం ఉదయం నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 19వ డివిజన్ ముత్యాలపాలెంలో 1, 2, 12, 17 మరియు 19 డివిజన్లలో 1కోటి 15 లక్షల రూపాయల అభివృద్ధి పనులను ప్రారంభించిన ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మరియు టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిల ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెల్లూరు రూరల్ అభివృద్ధే తమ లక్ష్యమన్నారు. అందుకే తాము నిత్యం ప్రజల్లో ఉంటూ, కూటమి ప్రభుత్వం చేసే మంచిని ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు. శ్రీధరన్న ప్రజలతో మమేకమయ్యే తీరు అద్భుతమని, నాయకులకు మార్గదర్శకమని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు.



సి.సి రోడ్డును ప్రారంభిస్తున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు

### పింఛన్లు ఇచ్చిన కోటంరెడ్డి

తన ఆరోగ్యం సరిగా లేకున్నా, పేద ప్రజల కోసం ఇంటింటికీ వెళ్ళి పింఛన్లు పంపిణీచేసి, అసలైన ప్రజానాయకుడని అనిపించుకుంటున్నాడు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. ఇటీవల అస్వస్థతతో ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న శ్రీధర్‌రెడ్డి, తనను మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన నెల్లూరురూరల్ ప్రజలకు స్వయంగా పింఛన్లు అందించేందుకు రావడంతో ప్రజలు ఆయన్ను సాదరంగా స్వాగతిస్తున్నారు. ఈనెల 1వ తేదీ బుధవారం ఉదయం రూరల్ పరిధిలోని 33వ డివిజన్ వెంగళరావునగర్‌లో లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి, వారికి స్వయంగా తన చేతుల మీదుగా పింఛను అందించడంతో వారి కళ్లు ఆనందంతో మెరిశాయి. పింఛను దారుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని వారికి నాలుగువేల రూపాయల పింఛను అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ప్రజలందరి ఆశీస్సులుండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట క్లస్టర్ ఇన్‌చార్జి మన్నెం పెంచలనాయుడు, కార్పొరేటర్ కరణం మంజుల, టీడీపీ నాయకుడు కరణం హజరత్‌నాయుడు, బీజేపీ నాయకుడు మండ్ల ఈశ్వరయ్య పాల్గొన్నారు.

# యుటీఎఫ్ ఆధ్వర్యంలో..నిరాహార దీక్షలు

పీఆర్సి కమిటీని నియమించాలని, మధ్యంతర భృతిని కల్పించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 1న నెల్లూరులో జిల్లాస్థాయి నాయకులు నిరాహార దీక్షలు ప్రారంభించారు. స్థానిక కలెక్టరేట్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ అధ్యక్షులు వీవీ శేషు, జేపీసీ జిల్లా ఛైర్మెన్ వెంకట్, నాయకులు బాబురెడ్డి, పెన్షనర్ల సంఘం నాయకుడు ఎస్కె గౌస్‌బాషా తదితరులు పాల్గొని మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని, ఉద్యోగులకు వేలకోట్ల రూపాయల బకాయిలున్నా వాటిని చెల్లించడానికి కృషి చేయకపోవడం దారుణమని ధ్వజమెత్తారు. ఆర్థిక పరిస్థితులు బాగాలేక ఎందరో ఉద్యోగ, ఉపాధ్యాయులు నానా బాధలు పడుతున్నారని, విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులు, తమ సమస్యల సాధన కోసం రోడ్డెక్కాల్సి రావడం బాధాకరమన్నారు. ఇకనైనా ప్రభుత్వం పట్టించుకుని తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరారు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com